రుడాలో ఓపెన్ ఫోరం

రాజమహేంద్రవరం సిటీ. డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని రుడా కార్యాలయంలో శుక్రవారం వీసీ,కమిషనర్ కేతన్ గార్గ్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాగింది. పలువురు తమ భవనాలు,లేఅవుట్లకు సంబంధించిన అర్జీలను అధికారుల అందజేసి..తమ అనుమానాలు నివృత్తి చేసుకున్నారు.



జీడిపప్పు కేజీ రూ.780

- తగ్గిన జీడిగింజల దిగుబడులు
- పెరిగిన ధర..వినియోగంపై ప్రభావం
- అక్టోబరులో కేజీ రూ.800

దేవరపల్లి/నల్లజర్ల,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీడిపప్పు ధరలు దిగిరావడంలేదు.. జిల్లాలో సాగు విస్తీర్ణం ఉన్నా ధరలు మాత్రం ఆకాశం వైపే చూస్తున్నాయి. ఎగుమతులు పెరిగిపోవడం..ఉత్పత్తి తగ్గిపోవడంతో ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అయితే గతం కంటే కాస్త తగ్గుముఖం పట్టడంతో వినియోగదారులు ఊపిరిపీల్చుకుంటున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా జీడిగింజల దిగుబడి తగ్గడంతో ధరలు పెరిగినట్టు సమాచారం. జీడిగింజలు ఇతర దేశాలైన ఇండోనేషియా, టాంజానియా, ఆఫ్రికా, వియత్నాం వంటి దేశాల నుంచి మనదేశానికి దిగుమతి చేసుకుంటారు. మనదేశంలో జీడిగింజలు దిగుబడులు బాగుంటే ధరలు తక్కువగా ఉండేవి. అయితే దిగుబడులు తగ్గడంతో.. జీడితోటలపై ఆశక్తి సన్నగిల్లడంతో దిగుబడులు తగ్గాయి. ప్రస్తుతం జీడిపప్పు వినియోగం భారీగా పెరిగింది. ఏ వేడుకైనా ఏదో ఒక కూరలో జీడిపప్పు తేలాల్సిందే.అంతే కాకుండా ఇళ్లల్లోనూ వినియోగం పెరిగింది. గతంలో ఇళ్లల్లో జీడిపప్పు వినియోగం అంతగా ఉండేది కాదు. ప్రస్తుతం వినియోగం పెరగడంతో ధరలూ అదే స్థాయిలో ఉంటున్నాయి. 2023 మార్చిలో జీడిపప్పు ధర కేజీ రూ.500 ఉండేది. 2024 అక్టోబర్‌లో రూ.800కి ఎగబాకింది. డిసెంబర్‌లో రూ.780లకు దిగొచ్చింది. ప్రస్తుతం గుత్ల ధర రూ.780, బద్ద రూ.780, ముక్క రూ.600, బాదం రూ.500, నూక రూ.300 ధరలు ఉన్నాయి. గతంలో ధరల కంటే ఒక్కసారిగా రూ.200 వరకు ధరలు పెరిగాయి. మనదేశంలో ఈ ధరలు పెరగడానికి ప్రతికూల వాతావరణం ప్రధానకారణం. దేవరపల్లి,నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో 200 వరకు జీడిపప్పు ఫ్యాక్టరీలు ఉన్నాయి.10 వేల మంది జీవనోపాధి పొందుతున్నారు.80 కేజీల జీడిగింజల రేటు రూ.12 వేలు నుంచి రూ.13 వేలు ఉంది. నాణ్యత బట్టి ధర ఉంటుంది.జీడిగింజల నాణ్యత తగ్గితే బస్తా రూ.10 వేలు ఉంటుంది. ప్రస్తుతం లాభదాయకంగానే ఉన్నా ఈ ఏడా ది అనుకున్నంత స్థాయిలో దిగుబడి రాలేదు.ఈ నేపథ్యంలో ప్రస్తుతం జీడిపప్పుకు డిమాండ్ ఏర్పడింది. జీడిపప్పు 80 కేజీల బస్తా రూ.62,400 ఉంది.

దిగుబడి తగ్గి..రేటు పెరిగింది..

విదేశాలు,మనదేశంలోనూ దిగుబడి తగ్గడమే జీడిపప్పు రేటు పెరగడా నికి కారణం.రేటు ఎక్కువగా ఉండడం, పప్పు బయట మార్కెట్‌లోకి వెళ్లకపోవడంతో వారానికి మూడు రోజులే ఫ్యాక్టరీ నడుపుడుతున్నాం.

- తీగల శ్రీనివాసగుప్తా, ఫ్యాక్టరీ యజమాని



రుడాను.. వదల్లేదు!

రుడా నిధులూ మింగేసిన వైసీపీ

- రూ.22 కోట్లకు లెక్కల్లేదు..
- ట్రెజరీ అకౌంట్ నుంచి మాయం
- జగన్ సభ ఖర్చు రుడాదే
- కొవ్వూరు సభకు రూ.50 లక్షలు
- కలెక్టర్ బంగ్లాకు రూ.3.5 కోట్లు
- మూడేళ్లలో జరగని ఆడిట్
- కూటమిలో రుడా ఆడిట్
- బయటకొస్తున్న వాస్తవాలు

వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఏం జరిగింది.. ఏం చేశారు.. ఏదో చేస్తున్నట్టు హడావుడి చేశారే తప్ప చేసిందేం లేదు.. నిధులను మాత్రం దర్జాగా పక్కదారి పట్టించేశారు.. రుడా సంఘటనే దానికి ఉదాహరణ.. రుడాకు సంబంధించిన నిధులు రూ.22 కోట్లు ఏమయ్యాయో నేటికీ తెలియదు.. ఎందుకంటే మూడేళ్లుగా ఆడిట్ జరగలేదు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆడిట్ నిర్వహిస్తే అసలు బాగోతం బయటపడింది.. ఇంతేనా ఇంకేమైనా ఉందా అనేది ప్రస్తుతం కూపీ లాగుతున్నారు..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు కొదువే లేదు..నిధులు పక్కదారి పట్టించడంలో గత వైసీపీ ప్రభుత్వం ఓ రికార్డు సాధించింది. పల్లె నుంచి పట్టణం వరకూ ఎక్కడ నిధులున్నా ఖజానాకు వెళ్లిపోవాల్సిందే. లెక్కా పత్రం ఉండేది కాదు.. నిబంధనలు తుంగలో తొక్కి నిధులు బొక్కేసిన తీరు చూసి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విస్తుపోతున్నారు.అభివృద్ధిని పట్టించుకోకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండా,పన్నులు, ఇతర ఫీజుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వం వాడేసుకోవడం గమనార్హం. దీనికి ఉదాహరణే రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా)..రుడా నిధులు పక్కదారి పట్టించి టోపీ పెట్టిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

జగన్ పర్యటన ఖర్చు రుడాదే..

వైసీపీ లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. గత మూడేళ్లలో రుడా లావాదేవీలపై ఆడిట్ జరగలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆడిట్ చేశారు. దీంతో ఇక్కడ లోపాలన్నీ వెలుగు చూస్తున్నాయి. రుడా పరిధిలోని లేఅవుట్లు, ఇతర భవనాలకు సంబంధించి వసూలు చేసే ఫీజును జమ చేయడానికి రెండు అకౌంట్లు ఉంటాయి. ఒకటి మెయిన్ అకౌంట్, రెండోది ట్రెజరీ పరిధిలో ఉండే పీడీ అకౌంట్. ఈ అకౌంట్‌తో అభివృద్ధి పనులు చేయాలి. కానీ ఇందులో రూ.22 కోట్లను రుడా అనుమతి కూడా తీసుకోకుండా నేరుగా వాడేశారు. తర్వాత దాని ఊసే లేదు. ఆ డబ్బంతా ఉంటే రుడా పరిధిలో అనేక అభివృద్ధి పనులు జరిగేవి. ఈ విషయాన్ని ఇటీవల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ దృష్టికి తీసుకుని వెళ్లినట్టు సమాచారం. దీనిపై కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి మరి. ఇక కలెక్టర్ బంగ్లాకు రుడా సొమ్ము రూ.3.5 కోట్లు ఖర్చు చేసినట్టు చెబుతూ వచ్చారు. గతంలో జగన్ కొవ్వూరు డివిజన్‌లో పర్యటనకు వచ్చిన సందర్భంగా అక్కడ ఏర్పాట్లకు రూ.50 లక్షలు రుడా నుంచి లాగేశారు. వాటిని రీఎంబర్స్ చేస్తామని అప్పట్లో చెప్పినా తర్వాత దాని ఊసే ఎత్తకపోవడం గమనార్హం. సాధారణంగా ప్రతి ఏడాది ఆ సంవత్సరంలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ జరగాలి. కానీ మూడేళ్లలో ఒక్కసారి కూడా ఆడిట్ జరగకపోవడం గమనార్హం. గతంలోనే ఆడిట్ చేసి ఉంటే ట్రెజరీ నుంచి రూ.22 కోట్లు ప్రభుత్వం వాడేసుకోవడం, జగన్ పర్యటకు రూ.50 లక్షలు వాడడం వంటి వ్యవహారాలన్నీ బయటకు వచ్చేవి. అసలు జగన్ పర్యటనకు ఈ నిధులు ఎలా ఇచ్చారనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఇది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అభివృద్ధి, ప్లానింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు వినియోగించాల్సిన నిధులను ఇలా దారి మళ్లించడం వల్ల రుడా సొమ్ము వృథా అయినట్టు ఉందనే విమర్శలు వస్తున్నాయి.

మూడేళ్లు.. ఏ ప్లానూ లేదు..

రుడా పరిధిలో కొన్ని ప్లాన్‌లు ఉంటాయి. పర్స్పెక్టివ్ ప్లాన్, మాస్టర్‌ప్లాన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్, రీజినల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఉంటుంది. కానీ గత రుడా పరిధిలో ఈ ప్లాన్‌లు అసలు జరగలేదు. మాస్టర్ ప్లాన్ కూడా లేదు. దీని వల్ల ఇటీవల అర్బన్ ఏరియా అభివృద్ధికి కేంద్రం నిధులు రావాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం ఉంది.ప్రస్తుత రుడా అధికారులు చేసేదేమీలేక 2019కి ముందు గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(గుడా)గా ఉన్న సమయంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను రాజమండ్రి సిటీ, దానిని పరిసర ప్రాంతాలకు చెందిన ప్లాన్ పంపించినట్టు సమాచారం. దీంతో రుడా పరిధిలోని విస్తీర్ణమంతా ఈ మాస్టర్ ప్లాన్‌లో లేదు. ప్రస్తుతం రాజమండ్రి, కొవ్వూరు డివిజన్లతో పాటు కొత్తపేట, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో కొంత ప్రాంతం కూడా రుడా పరిధిలో ఉంది. కానీ అధికారులు హడావిడిగా పంపిన ఈ ప్లాన్‌లో చాలా విస్తీర్ణం లేకపోవడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వం దృష్టిపెట్టి ఉంటే ఇవాళ మాస్టర్ ప్లాన్ కూడా లేని దుస్థితి వచ్చి ఉండేది కాదనే విమర్శలున్నాయి.

ప్రస్తుత పాలకవర్గం రూటెటు..

ప్రస్తుత పాలకవర్గం గత ప్రభుత్వం పక్కదారి పట్టించిన సొమ్మును ఎలా తిరిగి తెస్తుందో చూడాలి మరి.ఇంకా కొన్ని పనుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్టు విమర్శలు ఉన్నాయి. చాలా చోట్ల జిమ్‌లు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణపై సందిగ్ధత నెలకొనడంతో కొద్దిరోజుల తర్వాత ఈ జిమ్‌ల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రస్తుతం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ గత ప్రభుత్వ అవకతవలపై ఎటు వంటి చర్యకు ఉపక్రమిస్తారో వేచిచూడాల్సిందే.

ఎస్‌బీ డీఎస్పీగా రామకృష్ణ



రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి):తూర్పుగోదావరి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బి.రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణ గతంలో తూర్పుగోదావరి జిల్లాలో పనిచేశారు.అటుపై కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్‌డీవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై రాజమహేంద్రవరం వచ్చారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌బీ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఎస్పీ డి.నరసింహకిషోర్‌ను కలిసి మొక్క అందించారు.

26 నుంచి భాస్కర్‌నగర్ డాక్యుమెంట్లు పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భాస్కర్‌నగర్ ప్రాంతం నివాసులకు చెందిన దస్తావేజు, వాటి లింక్ దస్తావేజులను మీమీ ప్లాట్ల వద్దే ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు కలెక్టర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు పరిశీలించడం జరుగుతుందని జిల్లా సహకార అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజమహేంద్రవరం భాస్కర్ నగర్ ప్రాంతంలో ది రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్స్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన ప్లాట్లకు సంబంధించి యజమానులు దస్తావేజులు,లింక్ డాక్యుమెంట్లు, ఇంటి పన్ను,వాటర్ ట్యాక్స్ రసీదు ,ఇంటి ప్లాను, కరెంట్ బిల్లులను పరిశీలిస్తామని చెప్పారు.1970 నుంచి ఇప్పటి వరకు గల ఒరిజినల్ దస్తావేజులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.సందేహాలకు లిక్విడేటర్ నెం 944 12 39077ను సంప్రదించాలని కోరారు.

పట్టపగలు నగల షాపులో చోరీకి యత్నం

7

వైసీపీ నాయకులు వద్దు!

రసాభాసగా కొవ్వూరు టీడీపీ సమావేశం

- గత ఐదేళ్లు ఎంతో కష్టపడ్డాం
- టీడీపీ పేరు చెబితే వేధించారు
- మాపై కేసులు పెట్టారు..
- నేటికీ స్టేషన్లకు వెళుతున్నాం
- రాజీవ్‌కృష్ణను ఎలా చేర్చుకుంటారు
- నిలదీసిన టీడీపీ నాయకులు
- సర్దిచెప్పిన ద్విసభ్య కమిటీ
- అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తాం
- ఎమ్మెల్యే ముప్పిడి



వైసీపీ నాయకులను చేర్చుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించిన వైసీపీ నాయకులు మాకొద్దు అంటూ టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన తెలుగుదేశం పార్టీ సమావేశం రసాబాసగా మారింది. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని చెబుతుండగా కార్యకర్తలు, నాయకులు స్టేజి వద్దకు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని గత ఐదేళ్లు టీడీపీ నాయకులు, కార్యకర్తలను వేధించిన రాజీవ్‌కృష్ణ, అతని అనుచరులను నియోజకవర్గ నాయకులకు తెలియకుండా టీడీపీలో చేర్చుకోవడాన్ని తప్పుబట్టారు. బి.గంగరాజు మాట్లాడుతూ రాజీవ్‌కృష్ణతో పాటు మరి కొంత మంది వైసీపీ నాయకులు టీడీపీ కండువాలు కప్పుకోవడంతో గ్రామాల్లో అందరూ ఎగతాళి చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెట్టిన కేసులకు ఈ రోజుకి స్టేషన్‌కు వెళ్లి సంతకాలు పెడుతున్నామన్నారు. తాళ్లపూడి మండల అధ్యక్షుడు నామాన పరమేష్ మాట్లాడుతూ మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన వైసీపీ నాయకులను ఏ విధంగా పార్టీలో చేర్చుకుంటారని ప్రశ్నించారు. నాదెళ్ల శ్రీరామ్ మాట్లాడుతూ ఐదేళ్లు కష్టపడ్డాం.. పార్టీ గెలిచిందన్న ఆనందం ఆరు నెలలు కూడా లేకుండా చేస్తున్నారన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు గౌరవం అందించాలని డిమాండ్ చేశారు.ఐటీడీపీ ఇన్‌చార్జి గెల్లా సురేష్ మాట్లాడుతూ వైసీపీ నాయకులతో కుమ్మక్కై మాజీ మంత్రి జవహర్ కొవ్వూరు నియోజకవర్గంలో ఫ్లెక్సీల రాజకీయం ఆరంభించారన్నారు. బీసీ నాయకుడు కాగిత రఘు మాట్లాడుతూ టీడీపీ నాయకులపై కేసులు పెట్టించి ఇబ్బందులు పెట్టిన నాయకులను ఏ విధంగా పార్టీలో చేర్చుకుంటారన్నారు. నియోజకవర్గంలో మళ్లీ గ్రూపు రాజకీయాలు మొదలయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లి కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలకు గౌర వం అందించాలన్నారు. రాజీవ్‌కృష్ణ, అతని అను చరులను పార్టీలో చేర్చడానికి మాజీ మంత్రి కె. జవహర్, అతని కుమారుడు ఆశిష్‌లాల్ సహకరించడంపై మండిపడ్డారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాపై కూడా 15 కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారు. నా కారుపై దాడిచేశారు. కార్యకర్తలు బాధ, ఆవేదన నూటికి నూరు శాతం నిజం. కార్యకర్తల ఆవేదనను నియోజకవర్గ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు సమక్షంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల దృష్టికి తీసుకువెళ్తానన్నారు.మిమ్మల్ని కాదని కొత్తగా వచ్చిన వారికి పెద్దపీట వేయడం జరగదన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, నామాన పరమేష్, వట్టికూటి వెంకటేశ్వరరావు, రాజాన శ్రీనివాస్, మరపట్ల కళాధర్, ఎస్సీ , రజక కార్పొరేషన్ డైరెక్టర్లు వేమగిరి వెంకట్రావు, సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పది ఫలితాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి చిత్రంలో జిల్లా విద్యాధికారులు

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం విద్యా అనుబంధ శాఖల జిల్లా, డివిజన్ ,మండల స్థాయి అధికారులతో విద్యాశాఖ ప్రగతి లక్ష్యాలపై సమీక్షించారు. విద్యాప్రమాణాలు మెరుగు పరుచుకోవాలన్నారు.నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యాలు సాధించడంపై చక్కటి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని సూచించారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు సమయానికి ఐదు నిమిషాలు ముందుగానే ఉండాలన్నారు. స్టూడెంట్స్ ఆధార్ అప్‌డేషన్, పాఠశాలల పర్యవేక్షణ, టీచర్స్ , స్టూడెంట్స్ హాజరు, మధ్యాహ్న భోజన పథకం వంటి అంశాలపై ఆరా తీశారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా 100 రోజులు అదనపు తరగతులకు ప్రణాళిక వేశామన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు లక్ష్యాలను ఇచ్చి విద్యార్థులను మ్యాపింగ్ చేసినట్టు డీఈవో వాసుదేవరావు తెలిపారు. సమీక్షలో డీఎల్‌డీవో పి. వీణాదేవి,పీవో ఎస్.సుభాషిణి, ఆర్ ఐవో ఎన్ఎస్‌వీ ఎల్.నరసింహరావు, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

101 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాం

కలెక్టర్ ప్రశాంతి

గోకవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా ఉన్న భూ, రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు.ల్యాండ్ సీలింగ్ కేసులకు చెందిన అర్జీల పరిష్కారంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో ఈ నెల 12 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఇంత వరకు జిల్లాలో 101 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్టు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిలో ఆమోదయోగ్యమైన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి సదస్సుకు హాజరైన రైతుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి, తహశీల్దార్ ఎం.వి.సాయిప్రసాద్ ఉన్నారు.



కొత్తపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ఎస్ఈ తిలక్‌కుమార్ తదితరులు

5 స్టార్ రేటెడ్ పరికరాలే వినియోగించండి : ఎస్ఈ

రాజమహేంద్రవరంసిటీ/కల్చరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవడం వల్ల భవిష్యత్తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ కే.తిలక్ కుమార్ అన్నారు.ఈ నెల 14 నుంచి ప్రారంభమైన జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు ముగింపును పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.అందరూ 5స్టార్ రేటెడ్ విద్యుత్ పరికరాలను వినియోగించాలని, అవసరం లేనప్పుడు ఇంట్లో ఫ్యాన్లు, లైట్లు ఆఫ్ చేయాలన్నారు. ఈ నెల 18న నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం టౌన్ ఆపరేషన్స్ డివిజన్ ఈఈ నక్కపల్లి శామ్యూల్, డీఈఈ చిన్నమాల్యాద్రి, ఏఈ డి.శ్రీనివాస్, జూనియర్ ఇంజనీర్లు,విద్యుత్ శాఖ ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ప్రైవేట్ వైద్య సేవలు

- సూపర్‌స్పెషాలిటీ సేవలకు గ్రీన్‌సిగ్నల్
- గత సమావేశంలో ఎమ్మెల్యే తీర్మానం
- ఐఎంఏతో సూపరింటెండెంట్ చర్చ
- రోజువారి ప్రైవేటు వైద్యుల సేవలు



రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీజీహెచ్)లో ప్రైవేట్ వైద్యుల సేవలకు జిల్లా ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ప్రభుత్వ బోధనాసుపత్రిలో ప్రైవేట్ సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలకు రంగం సిద్ధమైంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వీటిని స్పాన్సర్ చేస్తోంది. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ ప్రైవేట్ ఆసుపత్రుల సూపర్ స్పెషాలిటీ వైద్యుల సేవలను ఉపయోగించుకోవాలని అందరు హెచ్‌వోడీలకు ఆదేశాలు ఇచ్చారు. ఏ రోజు ఏ స్పెషాలిటీ వైద్యులు సేవలందిస్తారనే టైం టేబుల్‌ను విడుదల చేశారు. జీజీహెచ్‌లో సోమవారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రైవేట్ వైద్యుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మంగళవారం ఐఎంఏ హాలులో ఐఎంఏ ప్రెసిడెంట్, ప్రైవేట్ వైద్యులతో జీజీహెచ్ సూపరింటెండెంట్ సమావేశమై చర్చించి తుది నిర్ణయం తీసుకున్నారు. దీనికి అనుగుణంగా శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేస్తూ ప్రైవేట్ స్పెషలిస్టు వైద్యుల టైం టేబుల్‌ను విడుదల చేశారు. ఐఎంఏ పర్యవేక్షణలో సూపర్‌స్పెషాలిటీ వైద్యులు జీజీహెచ్‌లో అవుట్‌పేషెంట్ (ఓపీ) సేవలు అందించనున్నారు.

ప్రైవేట్ వైద్యుల షెడ్యూల్ ఇలా..

జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల ఓపీ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకూ ఉంటుంది. మంగళవారం రోజు మాత్రం యూరాలజిస్ట్‌లు 5 గంటల వరకూ ఉంటారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలకు జీజీహెచ్‌లోని ఓపీ కారిడార్‌లో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించనున్నారు. షెడ్యూల్ ప్రకారం... ప్రతి మంగళవారం వాస్క్యులర్ సర్జన్, నెఫ్రాలజిస్ట్, యూరాలజిస్ట్ (ఇద్దరు వైద్యులు) ఓపీలో అందుబాటులో ఉంటారు. వాస్క్యులర్ సర్జన్ 3 నుంచి 4 గంటల వరకూ మాత్రమే ఉంటే మిగిలిన వైద్యులు 5 గంటల వరకూ ఉంటారు.బుధవారం యూరాలజిస్ట్, గురువారం కార్డియాలజీ, శుక్రవారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ప్లాస్టిక్ సర్జన్ ఓపీలో ఉంటారు.దీంతో జీజీహెచ్‌లో మళ్లీ ప్రైవేట్ వైద్యసేవలు ప్రారంభం కానున్నాయి.

బొమ్మలతో పాఠం
ఆయన ప్రత్యేకత



బొమ్మలతో ఆయన పాఠం చెప్పారంటే మదిలో పదిలమవుతుంది. విద్యార్థులకు సూటిగా, సులువుగా అర్థమయ్యే రీతిలో చేసే విద్యాబోధన వారిని ఆకట్టుకుంటోంది. పప్పెట్స్‌ను తయారు చేసి బోధనలో వినియోగిస్తూ.. అంతరించిపోతున్న తోలుబొమ్మలను తన బోధనలో మిళితం చేస్తున్నారు. వినూత్నంగా పాఠ్యాంశాలను బోధిస్తున్న ఆ మాస్టారి ప్రతిభను ప్రభుత్వం గుర్తించి మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించేందుకు ఎంపిక చేసింది. పలు అవార్డులు అందుకున్న ఈ మాస్టారి బోధనా విధానంపై ప్రత్యేక కథనం..

- బోధనలో ఆ మాస్టారి స్టైలే వేరు

బొమ్మలతో చేస్తున్న విద్యాబోధనను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

- వినూత్న రీతిలో గుర్తుండిపోయేలా పాఠాలు చెప్పడంలో ఆయన దిట్ట
- విద్యార్థులకు సులువుగా, సూటిగా అర్థమయ్యేలా క్లాసులు
- అంతరించిపోతున్న తోలుబొమ్మలతో పాఠ్యాంశాల బోధన
- ఆ మాస్టారు బోధించే తీరు అన్ని పాఠశాలలకు సీడీ రూపంలో..
- చైనాకు చెందిన కార్వింగ్ లీఫ్ ఆర్ట్‌లోను ఆయనకు ప్రవేశం

ఆంధ్రజ్యోతి, పిఠాపురం/గొల్లప్రోలు రూరల్

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పిల్లి గోవిందరాజులు విద్యార్థులకు విద్యాబోధనలో వినూత్న పద్ధతులు అవలంబిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. పప్పెట్స్(బొమ్మలు) తయారీతోపాటు వాటిని వినియోగించి విద్యార్థులకు విద్యాబోధన చేయడమే గాక ఇందులో ఉభయ తెలుగు రాష్ట్రాలు, పాండిచ్చేరి రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

అడుగు పడిందిలా..

విభిన్నమైన విద్యాబోధనల గురించి అవగాహన పెంచుకుని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధిస్తున్న తరుణంలో 2004లో రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు సీసీఆర్టీ(సెంట్రల్ కల్చరల్ రిసోర్స్ ట్రెయినింగ్) శిక్షణకు వెళ్లారు. ఆ శిక్షణతో పప్పెట్స్(బొమ్మలు) తయారీపై ఆసక్తి కలిగింది. కాగితాలను ఉపయోగించి రకరకాల పప్పెట్స్ మోడళ్లు తయారు చేశారు. కాగితాలను కట్ చేసి బొమ్మలు తయారు చేసే కిరిగామి, కాగితాలను మడత పెట్టి అందమైన బొమ్మలు తయారు చేసే ఒరిగామి పద్ధతుల్లో పలు రకాల మోడళ్లు రూపొందించారు. పపెట్స్, ఫింగర్ పప్పెట్స్, స్ట్రింగ్ పప్పెట్స్, షాడో పప్పెట్స్, రాడ్ మౌత్ పప్పెట్స్ తయారు చేసి విద్యార్థులకు విద్యాబోధనతోపాటు వారి తల్లిదండ్రులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. కరోనా సమయంలో దూరదర్శన్ ద్వారా పాఠ్యాంశాలు బోధించే సమయంలో పప్పెట్రీ మోడళ్లు ఎలా వినియోగించుకోవాలో వివరించారు.

ఆయన క్లాసంటే ఆసక్తి

గోవిందరాజులు ఎక్కడ పనిచేసినా ఆయన తరగతులపట్ల విద్యార్థుల్లో ఆసక్తి ఉంటుంది. పప్పెట్స్‌తో ఆయన చేసే విద్యాబోధన సులభంగా అర్థం కావడమే ఇందుకు ప్రధాన కారణం. కాగితాలను ఉపయోగించి విద్యార్థులతో రకరకాల బొమ్మలు తయారు చేయించడం, వారి మధ్య పోటీలు నిర్వహించడంతో వారిలో చదువుపై మరింత ఆసక్తి పెంచుతోంది. సైన్స్ వర్కింగ్ మోడళ్లు, నాటకీకరణ రూపంలో పాఠాలు చెబుతుండడంతో సులువుగా అర్థమవుతోందని ఆయన పాఠ్యాంశాలు బోధించే విద్యార్థులు చెబుతున్నారు. ఆర్ట్స్ క్రాఫ్ట్స్, నాటకాల ప్రదర్శనలోను విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

అవార్డుల పంట

బొమ్మలతో రకరకాల వినూత్న పద్ధతుల్లో బోధన సాగిస్తున్న పిల్లి గోవిందరాజులకు పలు అవార్డులు లభించాయి. 2018లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికై సీఎం చంద్రబాబునుంచి అవార్డు అందుకున్నారు. సదరన్ ఇండియా సైన్స్‌ఫేర్‌లో-2017 అవార్డుతో పాటు రాష్ట్రస్థాయిలో 2015లో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఎక్సలెన్స్ అవార్డు, 2016లో సద్గురు అవార్డు, 2018లో విద్యాశ్రీ అవార్డు, 2014లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2012లో గురుబ్రహ్మ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, ఆచార్య దేవోభవ అవార్డు సహా పలు పురస్కారాలు లభించాయి. వివిధ సంస్థల నుంచి జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నారు.

తోలుబొమ్మలాటను వినియోగించి..

రాష్ట్రంలో ఒకప్పుడు ప్రాచుర్యం పొంది నేడు అంతరించిపోతున్న తోలుబొమ్మలాటను విద్యాబోధనలో వినియోగించుకోవచ్చునని ప్రయోగపూర్వకంగా నిరూపించారు గోవిందరాజులు. విద్యాశాఖ రాష్ట్ర అధికారులు ముందు తోలుబొమ్మలాటతో బోధన ద్వారా అందరి దృష్టిని ఆకర్షించారు. దీనిపై, పప్పెట్రీ బోధనపై అధికారులు డాక్యుమెంటరీ ఫిల్మ్ తీసి సీడీలను రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు పంపారు. విద్యాబోధనలో తోలుబొమ్మల పాత్రపై ఈయన సమర్పించిన పత్రం అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమైంది.


తయారు చేసిన పప్పెట్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్


ఆర్ట్ లీఫ్ కార్వింగ్ ద్వారా గాంధీజీ, యోగాసనాలు, అంబేడ్కర్ చిత్రాలు రూపొందించిన మాస్టారు



కార్వింగ్ కళలో ప్రావీణ్యత

చైనాలో ప్రసిద్ధిగాంచిన కార్వింగ్ కళల్లో గోవిందరాజులు ప్రావీణ్యత పొందారు. ఆకులను అనుకూలమైన రీతిలో కట్‌చేసే లీఫ్ కార్వింగ్‌తో పాటు సోప్ కార్వింగ్, విజిటబుల్స్, ఫ్రూట్స్ కార్వింగ్ ద్వారా ప్రముఖుల చిత్రాలు, పండుగలు, ప్రత్యేక దినోత్సవాలను వివరించే రీతిలో ఆకృతులు చెక్కడం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

క్రిస్మస్ వెలుగులు

- సర్వాంగసుందరంగా ప్రార్థనా మందిరాలు
- విద్యుత్ దీపకాంతులతో ఆకట్టుకుంటున్న చర్చిలు

(ఆంధ్రజ్యోతి, రాజమహేంద్రవరం సిటీ)

రాజమహేంద్రవరం నగరంలో క్రైస్తవ ప్రార్థనా మందిరాల వద్ద క్రిస్మస్ వెలుగులు ఆకట్టుకుంటున్నాయి. రంగురంగుల విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా ఆకర్షిస్తున్నాయి. రాజమహేంద్రవరంలో ఆల్‌కట్‌గార్డెన్స్‌లోని గ్లోరియాడెన్ లూథరన్ చర్చ్, సుబ్రహ్మణ్య మైదానంలోని హోలీట్రినిటీ చర్చ్, టీటీడీ కళ్యాణ మండపం రోడ్డులోని బెటర్స్ లూథరన్ చర్చ్, జాంపేట సెయింట్ పాల్స్ చర్చ్, లూథర్‌గిరి చర్చ్‌ల్లో ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేశారు.


రాజమహేంద్రవరంలో స్టార్‌ల ఆకారంలో ప్రత్యేక విద్యుత్ వెలుగులతో ఆకట్టుకుంటున్న చర్చి


రాజమహేంద్రవరం హోలీట్రినిటీ చర్చి వద్ద ఆకట్టుకుంటున్న క్రిస్మస్ ట్రీలు విద్యుత్ కాంతులు


రాజమహేంద్రవరం సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి వద్ద ప్రత్యేక ఆకర్షణగా లైటింగ్

కబళిస్తున్న సంద్రం



- కొత్తపల్లి మండలం ఉప్పాడలో కోతకు గురవుతున్న తీరం
- కెరటాల ధాటికి కూలిన అంగన్‌వాడీ భవనం
- తీరప్రాంత గ్రామాల్లో ధ్వంసమవుతున్న మత్స్యకారుల ఇళ్లు





కొత్తపల్లి మండలం ఉప్పాడ సూరాడపేటవద్ద సముద్ర తీరంలో అలల ధాటికి కూలిన ఇళ్లు

కొత్తపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ, కోనపాపపేట గ్రామాలను సముద్రం కబళిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం ఉప్పాడ తీరప్రాంత గ్రామాలపై అధికంగా చూపిస్తోంది. సముద్రంలో రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి.

అలల ఉధృతి కారణంగా తీర ప్రాంత గ్రామాల్లో ఉదయం కనిపించిన ఇళ్లు సాయంత్రానికి, సాయంత్రం కనిపించినవి ఉదయానికి కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. గురువారం రాత్రి నుంచి ఈదురుగాలులతో సముద్రం ఉప్పొంగుతోంది. కెరటాల అలజడితో మత్స్యకారుల ఇంటి పునాదులు కోతకు గురై ఉదయానికి సముద్రం గర్భంలో కలిసిపోతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నంలోపు సముద్రంలో ఏర్పడే పోటు, పాట్లకు 30మంది మత్స్యకారులకు చెందిన ఇళ్లు సముద్రంలో కలిసిపోయాయి. చేతికి అందిన సామాన్లతో బాధిత మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. ఎన్నోఏళ్ల నుంచి తుఫాన్, అల్పపీడనాలు ఏర్పడడం, ఒడ్డునఉన్న గుడిసెలు కెరటాల ధాటికి సముద్రంలో కలిసిపోవడం జరుగుతూనే ఉంది. ప్రస్తుతం ఏర్పడే తుఫాన్‌లకు ఏ సమయంలో ఎలా ఉంటుందో తెలియకపోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని మత్స్యకారులు వాపోతున్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో వరుసగా అల్పపీడనాలతో వేట చేసేందుకు వీలులేక ఉపాధికి ఆటంకం ఏర్పడిందని, ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదని వారు ఆరోపిస్తున్నారు. తక్షణసాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కాకినాడలో...
ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

- జడ్పీటీసీలకు కాస్త ఊరట
- పదకొండు నెలల గౌరవ వేతనం మంజూరు
- 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

కాకినాడ సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విధులు లేవు.. నిధులు లేవు.. గౌరవ వేతనాల ఊసే లేదు.. అని ఆవేదన చెందుతున్న జడ్పీటీసీలకు కాస్త ఊరట లభించింది. శనివారం కాకినాడలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం, 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశాలు జరగనున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా గత స్థాయీ సంఘ సమావేశాలను ఎటువంటి చర్చ లేకుండానే ముగించారు. ఈ దఫా సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశాలున్నాయి. గత జడ్పీ సమావేశంలో గౌరవ వేతనాల కోసం గళం విప్పిన జడ్పీటీసీల ఆశలు చిగురించాయి. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత సభ్యులకు బకాయిపడిన 16 నెలలకు గాను 11 నెలల వేతనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో జడ్పీ యంత్రాంగం నిధుల మంజూరు కోసం సీఎస్ఎంఎఫ్‌కు బిల్లు పెట్టింది. 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు విడుదల చేయడంతో మండలాల్లో పనుల్లో కదలిక వచ్చింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 61 జడ్పీటీసీ స్థానాలకు 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ ఎన్నికలకు టీడీపీ దూరంగా ఉంది. దీంతో జడ్పీ పాలకవర్గం ఏకపక్షంగా ముందుకు సాగింది. వైసీపీ ప్రభుత్వంలో జడ్పీటీసీల వాణి వినిపించే అవకాశం లేకుండా పోయింది. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పాడేరు జిల్లాల పరిధిలో ఉమ్మడి జడ్పీ ఉంది. ఎంతో ప్రయాసపడి 100 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి సమావేశాలకు వచ్చే సభ్యులకు నిరాశే మిగిలేది. నాలుగు జిల్లాల నుంచి పూర్తిస్థాయిలో అధికారులు రాని పక్షంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలకు వివరణ లభించేది కాదు.

ఆరు నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జడ్పీ సమావేశాల్లో సమగ్ర సమాచారం లభిస్తోంది. ఆయా జిల్లాల అధికారులు కచ్చితంగా వచ్చేలా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించడంతో సమావేశాలు సజావుగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన జడ్పీ సమావేశంలో గౌరవ వేతన బకాయిల కోసం జడ్పీటీసీలు మూకుమ్మడి నిరసనకు దిగారు. సమావేశాన్ని బహిష్కరిస్తామని హెచ్చరించారు. దీంతో కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రభుత్వానికి లేఖ పంపుతామని, తదుపరి సమావేశానికి వేతన బకాయిలు మంజూరు చేసేలా సంప్రదింపులు జరుపుతామని స్పష్టం చేశారు. ఈ మేరకు జరిపిన సంప్రదింపుల మేరకు వేతన బకాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ఒక్కో జడ్పీటీసీ సభ్యుడికి నెలకు రూ.6వేల గౌరవవేతనం చొప్పున 11నెలలకు రూ.66 వేలు అందనుంది. 59 మంది సభ్యుల్లో జడ్పీ ఛైర్మన్‌ను మినహాయిస్తే 58 మంది సభ్యులకు రూ.38.28 లక్షల వేతన బకాయిలు విడుదల కానున్నాయి.



అధికారులు విధిగా హాజరు కావాలి: సీఈవో

శనివారం ఉదయం 10.30 గంటలకు కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం, 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు కోరారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. జడ్పీ సర్వసభ్య సమావేశానికి జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, స్థాయీ సంఘాల సమావేశాలకు ఆయా సంఘాల ఛైర్మన్లు అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, స్థాయి సంఘాల సభ్యులు హాజరవుతారని చెప్పారు.

కౌన్సిలింగ్‌లో 36 మందికి ఉద్యోగోన్నతి

కాకినాడ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోని గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతుల ప్రక్రియను శుక్రవారం కౌన్సిలింగ్ పద్ధతిలో కాకినాడ జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో డీఈవో పి.రమేష్ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరిచిన సీనియారిటీ లిస్టులో వున్న ఉపాధ్యాయులు 1:3 నిష్పత్తిలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు పుస్తకంతో కౌన్సిలింగ్‌కు వచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల నుంచి 72 మంది, మున్సిపల్ పాఠశాలల నుంచి 36 మంది హాజరయ్యారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు సంబంధించి 24 మందికి, మున్సిపాల్టీ పాఠశాలలకు సంబంధించి 12 మందికి ఉద్యోగోన్నతి కల్పించినట్టు డీఈవో చెప్పారు.


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డీఈవో రమేష్

నన్నయ విశ్వవిద్యాలయంలో
పిల్లల మనస్తతత్వ శాస్త్రం కోర్సు

దివాన్‌చెరువు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మనస్తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైల్డ్ అండ్ అడాలసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లొమా కోర్సును అందరూ సద్వినియోగం చేసుకోవాలని వీసీ ఆచార్య వైశ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. మనస్తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇప్పటివరకు రెండు బ్యాచ్‌లు ఈ కోర్సును పూర్తిచేశాయని, ప్రస్తుతం మూడో బ్యాచ్ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామన్నారు. ఏడాది కాల పరిమితితో 40 సీట్లతో ఈ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు పీజీ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. అర్హత, ఆసక్తి గల వారు జనవరి 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 22న కౌన్సిలింగ్ జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 92462 87989 నెంబరును సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, డీన్ కేవీ స్వామి, కోర్స్ కో-ఆర్డినేటర్ నక్కిన నారాయణ, అధ్యాపకులు రాజశేఖర్, సీహెచ్ భవానీ తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప కులపతి శ్రీనివాసరావు

కాకినాడ-వేమగిరి-జొన్నాడ రోడ్లకు
రూ.4.30 కోట్లతో డీపీఆర్ ఆమోదం

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ-వేమగిరి కెనాల్ రోడ్డు, కాకినాడ-జొన్నాడ రోడ్ల నిర్మాణానికి సంబంధించి డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) రూపకల్పనకు రూ.4.30 కోట్లతో పరిపాలనా ఆమోదం లభించింది. నాలుగు వరుసల రోడ్ల నిర్మాణానికి భూమి సేకరణ, ఇతర పనుల నిర్వాహణకు ఈ నిధులను వినియోగిస్తారు. సుమారు 118 కిలో మీటర్ల వరకు నాలుగు వరుసలుగా నిర్మించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధమవుతోంది. కాకినాడ నుంచి వేమగిరి వరకు నిర్మించే రోడ్డు జాతీయ రహదారి 16లో కలుస్తాయి. కాకినాడ, రామచంద్రపురం, మండపేట మీదుగా జొన్నాడ వద్ద జాతీయ రహదారి 16లో కలుపుతారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఉన్న ఈ రోడ్లను నిర్మించడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయని కాకినాడ ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కంతు తెలిపారు.

అన్నవరం దేవస్థానం పీఆర్వోగా కృష్ణారావు

అన్నవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం పీఆర్వోగా డీవీఎస్ కృష్ణారావును నియమిస్తూ ఈవో సుబ్బారావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు పీఆర్వోగా ఉన్న కొండలరావుకు ఆలయం, కేశఖండనశాల విభాగాలు కేటాయించారు. ఆయనతో పాటు మరో ముగ్గురు ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేశారు.

30 గంటలు..నరకయాతన!

- యాంత్రిక లోపంతో నిలిచిపోయిన బోట్లు
- చేపల వేటకు వెళ్లి సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులు
- అల్లవరం మండలం ఓడలరేవుకు సురక్షితంగా చేర్చిన అధికారులు



అల్లవరం మండలం ఓడలరేవు జెట్టికి చేరిన మత్స్యకారులతో మెరైన్ సీఐ మూర్తి, ఎస్ఐ విలియమ్స్

అల్లవరం/కాట్రేనికోన డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 4 రోజుల క్రితం బోటుపై సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లు చెడిపోయి 30 గంటలు నడిసంద్రంలో తిండిలేక నరకయాతన పడ్డారు. వారిని అధికారులు శుక్రవారం సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కాకినాడ సూర్యనగర్‌కు చెందిన ఒక బోటులో ఏడుగులు మత్స్యకారులు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరానికి చెందిన మరొక బోటులో ఏడుగులు మత్స్యకారులు ఈనెల 16వ తేదీ తెల్లవారుజామున సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. 19వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కొత్తపాలెం వద్ద భైరవపాలెనికి 7.6 నాటికన్ మైళ్ల దూరంలో యాంత్రిక లోపం వల్ల రెండు మత్స్యకార బోట్లు సముద్రంలో చిక్కుకుపోయాయి. 30 గంటల పాటు సాయం అందక ఉండిపోయారు. అయితే శుక్రవారం కాకినాడకు చెందిన మత్స్యకారులకు సాయం అందడంతో వారి బోటులో కాకినాడ వెళ్లిపోయారు. అల్లవరానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు నడిసంద్రంలో ఉండిపోయారు. కాకినాడ మెరైన్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని ఓడలరేవు మెరైన్ సీఐకు ఫోన్ చేశారు. ఈ నేపథ్యంలో విశాఖ మెరైన్ ఎస్పీ రవివర్మ ఆదేశాలతో ఓడలరేవు మెరైన్ సీఐ ఎంవీవీఎస్ఎన్.మూర్తి, ఎస్ఐ జి.విలియమ్స్ స్పందించి శుక్రవారం కొమరగిరిపట్నానికి చెందిన కొపనాతి భవానీ శంకర్ పెద్దబోటును సంఘటనా స్థలానికి పంపించారు. అయితే మత్స్యకారులను రక్షించే సమయంలో చుక్కాని గరికెన బుజ్జి సముద్రంలో ప్రమాదవశాత్తు జారీ పడిపోగా తాడు సాయంతో సహచర మత్స్యకారులు రక్షించారు. బోటు డ్రైవర్ గుర్రాల రాము కాలికి గాయమైంది. చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా బోటు ఇంజన్ చెడిపోయిందని, ఆ బోటులో 30 గంటలు నరక యాతన పడ్డామని గుర్రాల రాము, చొల్లంగి అప్పారావు, చొక్కా శివాజీ, దాసరి దుర్గ, గరికెన బుజ్జి, వంక సత్తిబాబు, గోసల మణికంఠలు అధికారులకు తెలిపారు. తినడానికి తిండిలేక ఉన్న కొద్దిపాటి అన్నం తిని గడిపామన్నారు. శుక్రవారం సాయంత్రం భవానీ శంకర్ బోటులో అల్లవరం మండలం ఓడలరేవు జెట్టికి చేరుకున్నామని, మెరైన్ అధికారుల చొరవతో తాము సురక్షితంగా బయటపడ్డామన్నారు. ఒడ్డుకు చేరినవారిని మెరైన్ సీఐ మూర్తి, ఎస్ఐ జి.విలియమ్స్, మత్స్యశాఖ అసిస్టెంట్ అనిత సురక్షిత ప్రాంతానికి తరలించారు. గతంలో సముద్రంలో బోట్లు తిరగబడి చెడిపోయిన సంఘటనలో పలువురిని రక్షించి ఒడ్డుకు చేర్చానని భవానీ శంకర్ తెలిపాడు.



మత్స్యకారులను ఒడ్డుకు చేర్చిన భవాని శంకర్

పంటకు బీమా.. రైతుకు ధీమా

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన

పేరిట పంటలకు బీమా సౌకర్యం

కరువుతో పాటు..

విపత్తుల్లోనూ ఉపయోగం

నెలాఖరు వరకే గడువు



సామర్లకోట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పేరిట రైతులు సాగుచేసిన పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. మరో పది రోజుల్లో గడువు ముగియనుంది. రబీ సాగుకు సమాయత్తం అవుతున్న ప్రస్తుత తరుణంలో బీమా పథకం సద్వినియోగంపై వ్యవసా యాధికారులు మరింత చైతన్యం తీసుకురావాల్సి ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం జరిగినపుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి ఈ పథకాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో లబ్ధి పొందేందుకు సీఎస్‌సీ సెంటర్లు, మీసేవ పోర్టలలో ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు రైతులు సాగు చేసిన పంటలకు వాటాగా కొంత నగదును చెల్లించి బీమా నమోదు చేయించుకోవాలి.

బీమా పొందేదిలా..

ప్రకృతి వైరీత్యాల వల్ల చీడపీడలు, ఈదురు గాలుల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన జిల్లా, మండల, గ్రామాల యూనిట్ ప్రాతిపదికన బీమా చేయించుకున్న రైతులకు నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుంది. బీమా కోసం ఎంపిక చేసిన పంటలకు బ్యాంకుల నుంచి రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంకులు కూడా రైతులకు బీమాను నమోదు చేస్తున్నాయి. రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు ఫసల్‌బీమా చేయించుకోవాలంటే దర ఖాస్తు పూర్తిచేసి సంబంధిత పత్రాల ద్వారా సీఈసీలలో బీమా చేయించుకోవాలి.

ఎకరానికి బీమా వివరాలు

పంట	రైతువాటా	ప్రీమియం(రూ.)	బీమా(రూ.)
వరి	0.40శాతం	215	43,000
మొక్కజొన్న	0.30శాతం	105	35,000
శనగలు	1.15శాతం	368	32,000

పథకంలో ప్రధాన అంశాలు

ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనలో రబీ సీజన్‌లో సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ధర చెల్లించి బీమా చేయించుకోవాలి. ఇదే బీమా పథకంలో శనగలు, మినుములు, ఎండుమిర్చి, జొన్న పంటలకు కూడా వర్తింపజేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే పంట సాగుచేసిన తర్వాత బీమా చేయించుకునేందుకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదై ఉండాలి. అవసరమైన పత్రాలు జతపరుస్తూ ప్రభుత్వం అనుమతించిన మీ సేవ, సీఈ సీ కేంద్రాల ద్వారా ఈ పథకంలో ఐచ్ఛికంగా చేరవచ్చు.

పంట కోతల తర్వాత..

పంటకోతల తర్వాత పొలంలో ఆరబెట్టిన పంటలకు వర్షాలు, తుపాను, అకాల వర్షాల వల్ల పంటనష్టం జరిగినపుడు అధికారులు వేసిన అంచన మేరకు రైతులకు నష్టపరిహారం అందిస్తారు.

గడువు పెంచితే ప్రయోజనం...



2016లో ఈ పథకం వచ్చినా సరైన అవగాహన లేని కారణంగా ఇంకా చాలామంది రైతులు బీమా చేయించుకోలేదు. ప్రస్తుతం అధికారులు అవగాహన కల్పిస్తున్నా బీమా చేయించుకునేందుకు నెలాఖరు వరకే ఉన్నందున కేవలం పది రోజుల మాత్రమే వ్యవధి ఉన్నందున మరింత అవగాహన అవసరం. రబీ వ్యవసాయపనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నందున జనవరి నెల వరకూ గడువు పెంచితే రైతులకు మరింత ప్రయోజనంగా ఉంటుంది.

బీవీ.సత్యనారాయణ, వరి రైతు, సామర్లకోట

కిక్..వచ్చింది!

- పిఠాపురంలో ముగిసిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు
- ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న విశాఖ జిల్లా
- రెండో స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జిల్లా
- జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు పదిమంది ఎంపిక



రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు జరిగిన 8వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి 150మందికి పైగా బాక్సర్లు పాల్గొన్నారు. బాక్సర్ల బరువు ఆధారంగా వారిని పది కేటగిరీలుగా విభజించి పోటీలు నిర్వహించారు. ప్రతి విభాగంలో ఒకరికి గోల్డ్ మెడల్, మరొకరి సిల్వర్ మెడల్ అందించగా, ఇద్దరికి బ్రాంజ్ మెడల్స్ బహూకరించారు. శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీలను తిలకించేందుకు విద్యార్థులు, ప్రజలు అధికంగా తరలివచ్చారు. ఈ పోటీలు చివరివరకూ ఉత్కంఠభరితంగా జరిగాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్ విశాఖ జిల్లా బాక్సర్లు కైవసం చేసుకోగా, రెండో స్థానంలో శ్రీకాకుళం జిల్లా నిలిచింది. పది విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించిన పదిమంది బాక్సర్లను జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. వారు ఉత్తరప్రదేశ్‌లో జనవరి 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ జరిగే ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు ప్రకటించారు. పోటీల్లోని విజేతలకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాసకుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత డాక్టర్ ఐ.వెంకటేశ్వరరావు, రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి.లక్ష్మణదేవ్, పి.లక్ష్మణరావు బహుమతులు, మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనుబాబు, కేతవరపు కృష్ణ, పాఠశాల విద్యాక మిటీ వైస్‌చైర్మన్ సూర్యావతి, బల్ల నవీన్‌వంశీ, సాయిఅఖిల్, కె.చిన్నబ్బాయి, జె.ప్రసాదరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

మెడల్స్ సాధించిన బాక్సర్లు వీరే

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల 47-50కిలోల విభాగంలో పి.పవన్(విశాఖ జిల్లా) గోల్డ్‌మెడల్ సాధించగా, వై.ప్రభుదాస్(తిరుపతి)కి సిల్వర్‌మెడల్, ఎస్.రాంబాబు(కడప), ఎమ్.జయంత్ సాయిస్వరూప్(మన్యం)లకు బ్రాంజ్‌మెడల్స్ లభించాయి. 50-55కిలోల విభాగంలో సీహెచ్.జన్నేశ్వరరావు(శ్రీకాకుళం), పి.ప్రసాద్(విశాఖ)లకు గోల్డ్, సిల్వర్ మెడల్స్, బాలగణేష్‌రెడ్డి(కడప), సూర్య దేవేందర్(నంద్యాల)లకు బ్రాంజ్‌మెడల్స్.. 55-60 కిలోల విభాగంలో పి.అపల్రాజు(శ్రీకాకుళం), డి.సందీప్(విశాఖ)లకు గోల్డ్, సిల్వర్.. ఎస్‌కే బాజీబాబా(ఎన్టీఆర్‌జిల్లా), పి.దిగ్విజయ్(కడప)లకు బ్రాంజ్‌మెడల్స్... 60-65కిలోల విభాగంలో భాను ప్రకాష్(విశాఖ), పి.విశేశ్వరరావు(శ్రీకాకుళం)లకు గోల్డ్, సిల్వర్ మెడల్స్.. జయసాయితరుణ్(నెల్లూరు), ఎస్.సతీష్(పశ్చిమగోదావరి)లకు బ్రాంజ్ మెడల్స్ లభించాయి.

65-70కిలోల విభాగంలో ఎం.అంజనీకుమార్(విశాఖ), లోకేష్(శ్రీకాకుళం)లకు గోల్డ్, సిల్వర్.. పి.బాలాజీ(తిరుపతి), కె.చంద్రశేఖర్(విజయనగరం)లకు బ్రాంజ్‌మెడల్స్, 70-75కిలోల విభాగంలో ఎస్‌కే ముజీబ్ రహ్మాన్(విశాఖ), ఎస్.ఏసు(శ్రీకాకుళం)లకు గోల్డ్, సిల్వర్.. ఎన్.హరికృష్ణ, బి.కార్తీక్(అనంతపురం)లకు బ్రాంజ్.. 75-80కిలోల విభాగంలో ఎస్.సాయితేజ(విశాఖ), కె.శ్రీకాంత్(శ్రీకాకుళం)లకు గోల్డ్, సిల్వర్.. ఎం.సాగర్(నెల్లూరు), జి.పవన్‌కుమార్(ఎన్టీఆర్‌జిల్లా)లకు బ్రాంజ్.. 80-85కిలోల విభాగంలో వి.శ్రీధర్(పశ్చిమగోదావరి), ఎం.దినేష్‌రెడ్డి(అనంతపురం)లకు గోల్డ్, సిల్వర్.. బి.జగదీష్‌నాయుడు(కడప), కె.రామ్(కడప), 85-90కిలోల విభాగంలో ఎల్.సాయివెంకట్(పశ్చిమగోదావరి), డి.మనోజ్‌కుమార్(శ్రీకాకుళం)లకు గోల్డ్, సిల్వర్.. టి.జస్వంత్(ప్రకాశం), వి.అభిషేక్(విజయనగరం)లకు బ్రాంజ్ మెడల్స్ లభించగా, 90కిలోలు అంతకంటే అధిక బరువు కలిగిన వారి విభాగంలో ఆర్.హేమంత్‌కుమార్(శ్రీకాకుళం) గోల్డ్‌మెడల్ సాధించగా, వై.వినయ్(ఎన్టీఆర్) సిల్వర్‌మెడల్, బి.ద్రావిడ్(బాపట్ల జిల్లా), డి.వెంకటేశ్వరుడు(విజయనగరం)లు బ్రాంజ్ మెడల్స్ గెలుపొందారు.

పెరుగు ప్యాకెట్ కోసం వెళ్లి వస్తుండగా..

హైవేపై రెండు ద్విచక్రవాహనాలు

ఢీకొన్న ఘటనలో ఒకరి మృతి

మరొకరి పరిస్థితి విషమం



సంఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న వాహనాలు

తొండంగి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి సెంటర్‌లో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెండపూడికి చెందిన గెల్లి శ్రీనివాసరావు (52) గ్రామంలో పని ముగించుకుని తాను నివాసం ఉండే తారకరామా కాలనీ వైపు ఎక్సెల్ బండిపై హైవే దాటుతున్నాడు. అదే సమయంలో ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన వెన్నెల వీరబాబు(30) స్కూటీపై కత్తిపూడి వైపు నుంచి వస్తుండగా 2 వాహనాలు బలంగా ఢీకొన్నాయి. దీంతో రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. జరిగిన ప్రమాదంలో శ్రీనివాసరావు తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. వీరబాబుకు కూడా తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో వారిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు అక్కడ మృతిచెందగా వీరబాబు చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. శ్రీనివాసరావుకు భార్య రత్నం, కుమార్తె, కుమారుడు ఉన్నారు. తారక రామా కాలనీలో హైవేను ఆనుకుని కాకా హోటల్ నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. పెరుగు ప్యాకెట్ కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదంలో మృత్యువాత పడడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. క్షణాల్లో విగత జీవిగా మారిన తండ్రిని చూసి బిడ్డలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే హైవే సిబ్బంది ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన శ్రీనివాస రావు(ఫైల్)

వినూత్న ఆలోచనలతో సత్ఫలితాలు

కేఐఐటీ పరిశోధనా అభివృద్ధి

ఆవిష్కరణల డైరెక్టర్ జనరల్



సదస్సులో అతిథులకు వరి కంకులతో స్వాగతం పలికిన జీజీయూ యాజమాన్యం

రాజానగరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వినూత్న ఆలోచనలతో ముందడుగు వేస్తే మంచి ఫలితాలను పొందవచ్చని భువనేశ్వర్‌లోని కేఐటీ పరిశోధనా అభివృద్ధి ఆవిష్కరణల డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ సూఆర్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో వ్యవసాయ ఆవిష్కరణ సదస్సును చాన్సలర్ కేవీవీ.సత్యనారాయణరాజు శుక్రవారం ప్రారంభించారు. మృత్యుంజయ మాట్లాడుతూ ఆవిష్కరణలకు ఇన్నోవేషన్లకు నిధులు ప్రధానం కాదని, భిన్నంగా ఆలోచించడం ముఖ్యమన్నారు. ఆధ్రప్రదేశ్ నూతన ఆవిష్కరణలకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. వ్యవసాయ విభాగంలో బీఎస్సీ పూర్తిచేసిన వారికి స్టార్టప్‌లకు ఎన్నో అవకాశాలున్నాయని ఆ దిశగా పయనించాలని సూచించారు. మరో ముఖ్యఅతిథి రాజ రాంనగర్‌లోని ఆర్ఐటీ డైరెక్టర్ పివి కడోలి మాట్లాడుతూ సాంకేతిక పరిశోధనలో పరస్పరం విజ్ఞాన మార్పిడి కార్యక్రమాలను జీజీయూతో కలిసి నిర్వహిస్తామన్నారు. సదస్సులో జీజీయూ ప్రోచాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, కేకేహెర్బల్ సంస్థల మేనేజర్ కేర్ కధం, సీటీఆర్ఐ డైరెక్టర్ ఎం.శేషు మాధవ్, వీసీ యు.చంద్రశేఖర్, వీఐటీ ఏపీ డైరెక్టర్ అమిత్‌చవాన్, ఏఐసీటీఈ ఐపీ అండ్ టీటీ ఏపీ హెడ్ ఐఎస్ భీమలింగేశ్వర రెడ్డి, రాష్ట్ర ఉన్నత మండలి అకాడమిక్ అధికారి శ్రీరంగంమ్యాథ్యూ ఉన్నారు.

'ప్రత్యేక జాబ్‌చార్ట్ ప్రకటించాలి'

సర్పవరం జంక్షన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణ అధికారులకు ప్రత్యేక జాబ్‌చార్ట్ ప్రకటించాలని, రైతు సేవా కేంద్రాల్లో నియమించరాదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కాకినాడ ఆత్మ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఏఈవోల సంఘం అధ్యక్షులుగా సీహెచ్ నాగరాజు (కోనసీమ), కార్యదర్శిగా యువీ.సతీష్ (కాకినాడ), కోశాధికారిగా ఎం.నాగేశ్వరరావు (తూర్పుగోదావరిజిల్లా), సహ అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్ (కోనసీమ), ఉపాధ్యక్షులుగా శివకుమారి, దుర్గారావు, శివ, గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా స్వామిదాస్‌నోవా, కృష్ణయ్య, సోమిరెడ్డి, ఆడిటర్‌గా గోపీనాథ్, కార్యవర్గ సభ్యులుగా భువనేశ్వరి, కృష్ణవేణి, వసంత, శాంతి కమల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా విశాఖ జిల్లా అధ్యక్షుడు త్రివిక్రమరావు, సహాయ ఎన్నికల అధికారిగా రాష్ట్ర కోశాధికారి సుభానీ వ్యవహరించారు.

పట్టపగలు నగల షాపులో చోరీకి యత్నం

విఫలయత్నం చేసిన ఇద్దరు యువకులు

వీరిలో ఒకరు సచివాలయ ఉద్యోగి

బాధితుల కేకలు..పట్టుకున్న స్థానికులు

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

అన్నవరంలో ఘటన



చోరీకి యత్నించిన ఇద్దరు యువకులను పట్టుకున్న స్థానికులు



గాయపడిన నగలు దుకాణ యాజమాని భార్య రాజేశ్వరి



దుకాణంలో పనిచేసే వ్యక్తికి గాయాలు

అన్నవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రెండురోజులు క్రితం కాకినాడ తనిష్క్ షోరూమ్‌లో పట్టపగలు బంగారం దొంగతనం సంఘటన మరువక ముందే శుక్రవారం అన్నవరంలో ఒక నగల దుకాణంలో దుకాణ యజమాని, అతని సతీమణి, మరో వ్యక్తిపై ఇద్దరు యువకులు పట్టపగలు సుత్తితో దాడి చేసి సుమారు రెండు కిలోల బంగారం తస్కరించేందుకు ప్రయత్నించడంతో వారి కేకలతో స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. చోరీకి యత్నించిన ఇద్దరు యువకుల్లో ఒకరు సచివాలయ ఉద్యోగి కావడం కొసమెరుపు. ఆ సమయంలో వారు గంజాయి మత్తులో ఉన్నట్టు స్థానికులు పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా అన్నవరం స్టేషన్‌రోడ్డులో జీవన్ జ్యూయలర్స్ నగలు దుకాణం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో తొండంగి మండలం కొత్తపల్లికి చెందిన మామిడి రాజు (22), ఉద్దగిరి అఖిల్ (24) నగల దుకాణంలో ఉన్న యజమాని లక్ష్మణరావు, ఆమె సతీమణి రాజేశ్వరి, షాపులో పనిచేసే మంగరాజుపై సుత్తితో దాడిచేసి సుమారు రెండుకిలోల నగలు దోచుకెళ్లేందుకు ప్రయత్నం చేయగా వారు కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకుని యువకులకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ముందుగా క్షతగాత్రులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు, అన్నవరం ఎస్ఐ హరిబాబులు తుని ఆసుపత్రికి వెళ్లి బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకడైన ఉదగిరి అఖిల్ తొండంగి మండలం సీతారామపురం గ్రామ సచివాలయ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బెట్టింగ్ వ్యసనాలకు లోను కావడంతో వారు చోరీల బాటపట్టినట్టు స్థానికులు చెప్పారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

తెగిపడిన వ్యక్తి కాలు

ఎటపాక, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి మీద రాయనపేట మలుపు వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని షిఫ్ట్ డిజైర్ కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లికి చెందిన కె.సాయి ఈశ్వర్ భద్రాచలం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో విధులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రాయనపేట వద్దకు రాగానే నెల్లిపాక వైపు నుంచి భద్రాచలం వైపు వస్తున్న షిఫ్ట్ డిజైర్ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయి ఈశ్వర్ కుడి కాలు భాగం తెగి రహదారిపై పడింది. తీవ్ర రక్తస్రావం కావడంతో క్షతగాత్రుడిని వెంటనే భద్రాచలంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొబ్బరిచెట్టు పై నుంచి జారి పడి దింపు కార్మికుడి మృతి



వెంకట్రావు (ఫైల్)

ముమ్మిడివరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలో దింపు కార్మికుడు కొబ్బరిచెట్టుపై నుంచి జారిపడి మృతి చెందాడు. చినకొత్తలంక గ్రామానికి చెందిన కముజు వెంకట్రావు (59) గురువారం అదే గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో దింపు తీస్తుండగా ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వెంకట్రావును పొలం రైతు, స్థానికులు 108 అంబులెన్సులో అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దింపు కార్మికుడిగా జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి వెంకట్రావు సంపాదనే ఆధారం. అందరితో కలిసిమెలసి ఉండే వెంకట్రావు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గోదావరి ఏటిగట్టుపై

భారీ కొండచిలువ

ఆలమూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు వద్ద గోదావరి ఏటిగట్టుపై శుక్రవారం రాత్రి భారీ కొండచిలువ కనిపించింది. వాహనదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కొండచిలువ వెళ్లేంతవరకూ నిలిచి ఉండిపోయారు.



క్రీడా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

'శ్రీప్రకాష్'లో ప్రారంభమైన అంతర్ జిల్లా, రాష్ట్ర ఛాంపియన్‌షిప్ టీటీ పోటీలు



టీటీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన నానాజీ, ప్రముఖులు

పెద్దాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. కాకినాడ సురేష్‌నగర్‌లో ఉన్న శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో సీతా నరసింహ క్షేత్ర మల్టీపర్పస్‌హాల్లో నిర్వహించిన ఏపీ అంతర్ జిల్లా, రాష్ట్ర ఛాంపియన్‌షిప్ టీటీ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, నిత్య సాధనతోనే విజయం సాధించవచ్చన్నారు. టీఆర్ఈఏ ప్రెసిడెంట్ బీవీ కృష్ణారావు, కాకినాడ సీ పోర్టు ముఖ్య కార్యనిర్వాహణాధికారి మెర్ల మురళీధర్ మాట్లాడుతూ యువ ప్రతిభను పెంపొందించడంలో, క్రీడాకారుల మధ్య స్నేహ పూరిత వాతావరణాన్ని ఏర్పరచడంలో ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు కేవలం విద్య మాత్రమే కాకుండా క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ టీటీ క్రీడాకారుడు ముక్కామలను స్మరించుకుని ఐదు నిమిషాలు మౌనం పాటించారు. పోటీలకు 12 జిల్లాల నుంచి 230 మంది క్రీడాకారులు, 35 మంది రిఫరీలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీ టీటీ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్, వి.భాస్కరరామ్, రావు చిన్నారావు పాల్గొన్నారు.

వేమగిరి పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు


వేమగిరిలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరిలో పర్యాటక అభివృద్ధికి కేటాయించిన ప్రాంతాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సందర్శించారు. పర్యాటక అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాలు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, చెల్లుబోయిన శ్రీను, ముద్రగడ జమీ, ఎంపీడీవో కె.రమేష్, తహశీల్దారు కె.పోశిబాబు, దుర్గేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమయపాలన ఖచ్చితంగా పాటించాలి: జేసీ



కాటవరం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న జేసీ చిన్నరాముడు

సీతానగరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల నిర్వహణలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అధికారులకు సూచించారు. శుక్రవారం కాటవరం గ్రామంలో జరిగిన సదస్సుకు ఆయన విచ్చేసి మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను మార్గదర్శకాలకు లోబడి, సహేతుంగా పరిష్కారం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలని, ఇందుకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ సదస్సుల్లో సమర్పించాలని జేసీ చెప్పారు. శుక్రవారం జరిగిన సదస్సులో 14 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తా

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో రహదారులు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని 37,42,43 డివిజన్లలో రూ.41.78 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రహదారులు, డ్రైనేజీలు వంటి ముఖ్యమైన సమస్యలు గాలికొదిలేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏదైతే హామీలు ఇచ్చామో వాటిని తప్పకుండా నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంటిపూడి శ్రీనివాస్, నక్కా దేవి వరప్రసాద్, ఉర్లంకల లోకేష్, బాబి, జి.రామకృష్ణ, మళ్ళ వెంకట్రాజు, పిల్లి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని ర్యాంపు నుంచి ఇసుక తరలింపు

- ముగ్గుళ్లలో ట్రాక్టర్లను అడ్డగించిన సొసైటీ భూముల రైతులు
- ఇసుక తవ్వకాలు నిలిపివేత

సీతానగరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనుమతి లేని ముగ్గుళ్ల ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం ఉదయం సొసైటీ భూముల రైతులు అడ్డగించారు. తమ పొలంలో అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేయడమేమిటని ప్రశ్నించారు. అయితే ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రకటించింది గనుకే ఎక్కడైనా తవ్వుకుంటామంటూ ట్రాక్టర్ డ్రైవర్లు యజమానులు ఖరాఖండిగా చెప్పడం, రైతులు ససేమిరా అనడంతో వివాదం ముదిరింది. దీంతో పోలీస్, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకున్నారు. ముగ్గుళ్ల ఇసుక ర్యాంపుకు అనుమతి లేదని, వంగలపూడి ర్యాంపునుకు ఉందని అక్కడకు వెళ్లి ఇసుక తెచ్చుకోవచ్చునని తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ చెప్పారు. ముగ్గుళ్లలో తవ్వకాలు నిలిపివేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, పెయింటింగ్, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. శక్తి వనరుల పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు.కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి,అధ్యాపకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి

- భూపతిపాలెంలో త్వరలో అధికారుల బృందం పర్యటన
- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- గురుకుల పాఠశాల సందర్శన


కళాశాల ఏర్పాటుపై చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపాలెంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం త్వరలో అధికార బృందాన్ని పంపి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భూపతిపాలెం గురుకుల పాఠశాలను శుక్రవారం టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నవీన్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గళ్లా రాము జూనియర్ కళాశాల ప్రతిపాదనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై కలెక్టర్ ప్రశాంతి గురుకుల పాఠశాల నిర్వహణ, జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుకూలత, అందుబాటులో ఉన్న స్థలం తదితర అంశాలపై వారితో చర్చించారు. ప్రస్తుతం పాఠశాలలో సుమారు 480మంది విద్యనభ్యసిస్తున్నారని, పాఠశాల సమీపంలో జూనియర్ కళాశాల ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందని, దీనిపై ఇప్పటికే మంత్రి లోకేశ్ ను కలిసి వినతిపత్రం అందజేసినట్టు కలెక్టర్‌కు నవీన్ వివరించారు. ఉన్నతాధికారుల బృందం త్వరలో భూపతిపాలెంలో పర్యటించి సంబంధిత నివేదికను ప్రభుత్వానికి అందజేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. అనంతరం పాఠశాల నిర్వహణా తీరును, డార్మెటరీని ఆమె పరిశీలించారు. విద్యుత్ సరఫరాతోపాటు డార్మెటరీలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవి, టీడీపీ నాయకులు మంగరౌతు రాము, అడపా భరత్, అడపా వెంకట్రావు, ఇదుదుల అర్జున్నరావు, పురంశెట్టి శివాజీ, బదిరెడ్డి అచ్చన్నదొర, మండిగ గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ పార్శిల్స్ డోర్ డెలివరీ మాసోత్సవాలు

జనవరి 19 వరకూ నిర్వహణ

రాజమహేంద్రవరం డీఎం షబ్నం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీలో శుక్రవారం నుంచి పార్శిల్స్ డోర్ డెలివరీ మాసోత్సవాలు ప్రారంభించినట్టు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం డిపోలో గేట్ మీటింగ్ ఏర్పాటు చేసి ఉద్యోగులందరికీ మాసోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. జనవరి 19వ తేదీ వరకూ మాసోత్సవాలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని ముఖ్యమైన 80 ప్రాంతాలకు పార్శిల్స్ డోర్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం కమర్షియల్ మాధవ, అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు, ఎంఎఫ్ నాగలక్ష్మి, డీఎంఈ మూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మొబైల్ వినియోగం తగ్గించాలి

నన్నయ తెలుగుశాఖ సహాయ ఆచార్యుడు వాసు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తలారి వాసు

దివాన్ చెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నేటితరం ఎక్కువగా మొబైల్ ఫోన్‌లను వాడుతూ కాలం వృథా చేస్తున్నారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సహాయాచార్యుడు తలారి వాసు అన్నారు. మొబైల్ ఫోన్ వినియోగం తగ్గించి అవసరం మేరకే వాటిని ఉపయోగించాలని సూచించారు. దివాన్‌చెరువులోని వీజే ఫార్మశీ కళాశాలలో బి-ఫార్మశీ, డి-ఫార్మశీ మొదటి సంవత్సరం తరగతులను శుక్రవారం ప్రారంభించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన వాసు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో కళాశాల కార్యదర్శి ఎస్‌వీవీ జగన్మోహనరెడ్డి, చైర్‌పర్సన్ ఎన్.శకుంతల, వైస్‌చైర్‌పర్సన్ ఎన్.తులసీ అపూర్వ, డైరెక్టర్ నిరూప్ కోటిరెడ్డి, ప్రిన్సిపాల్ డి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో కెనాల్ రోడ్డు అభివృద్ధికి కృషి


అనపర్తిలో కెనాల్ రోడ్డు మరమ్మతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-వేమగిరి కెనాల్ రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి-ద్వారపూడి, బిక్కవోలు నుంచి జోడు నాదాలతూము వరకు సుమారు రూ.5.40 కోట్ల నిధులతో ప్రారంభించిన రోడ్డు మరమ్మతు పనులను శుక్రవారం అనపర్తిలో ఆయన పరిశీలించారు. మరమ్మతు పనుల్లో రాజీ పడవద్దని ఇప్పటికే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన కాంట్రాక్టరు, అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఏడు రోడ్లను గుర్తించిందని, దీనిలో కెనాల్ రోడ్డు కూడా ఉందన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ద్వారా నేషనల్ హైవే కనక్టవిటీ ద్వారా రోడ్డును అభివద్ధి చేయాలన్న ప్రతిపాదన కూడా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట డీసీ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, తదితరులున్నారు. అలాగే ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అనపర్తి శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలండర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామవరంలోని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పీవీఎస్ సూర్యనారాయణ, ఎంవీ సుబ్రహ్మణ్యం, ఎంవీ కృష్ణారెడ్డి, తాడి గణపతి రామారెడ్డి, డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బాధితురాలికి ఆర్థిక సాయం అందజేత



బిక్కవోలు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రంగాపురంలో గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించి ఇల్లు కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన నక్కా లక్ష్మి కుటుంబాన్ని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ నాయకులు సమకూర్చిన నగదు, నిత్యావసరాలు, రెవెన్యూ వారిచ్చిన బియ్యాన్ని ఆమెకు అందజేశారు. హౌసింగ్‌లో ఇంటిని మంజూరుచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేతా ఏసురత్నం, నాయకులు నడింపిల్లి చిరంజీవిరాజు, కానాటి అప్పల స్వామి, చెల్లె జోష్‌బాబు, పొట్టు వాడపల్లి, నక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

గొల్లలమామిడాడ ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించాలి



రంగంపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి రంగంపేట, బిక్కవోలు మీదుగా గొల్లలమామిడాడ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మండలంలోని దొడ్డిగుంట గ్రామానికి చెందిన పంట రమేష్. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి శుక్రవారం కోరారు. రంగంపేట నుంచి బిక్కవోలు వైపు బస్సు సౌకర్యం లేనందున మండల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఆర్టీసీ డిపోమేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే సూచనతో బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ ఆర్టీసీ డీఎంకు రమేష్‌కు వినతిపత్రం అందించారు.

తెలంగాణలో వంద అడుగుల ఎన్‌టీఆర్ విగ్రహం


గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో వంద అడుగుల ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్‌టీఆర్ నాలెడ్జ్ సెంటర్ కు ప్రభుత్వ స్థలం కేటాయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం సంతోషమన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

'సిగ్నల్ ప్రోసెసింగ్'కు అవకాశాలు మెండు

దివాన్‌చెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సిగ్నల్ ప్రోసెసింగ్, మిషన్ లెర్నింగ్‌పై ఎన్నో అవకాశాలు ఉన్నాయని తిరుపతిలోని ఐఐటి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. భూపాలపట్నంలోని రైట్ కళాశాలలో సిగ్నల్ ప్రాసెసింగ్ మిషన్ లెర్నింగ్‌పై శుక్రవారం జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ సుధీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి రవికిరణ్, కోఆర్డినేటర్ సీహెచ్ సూరిబాబు, విభాగాధిపతులు ఆర్.రాంబాబు రెడ్డి, ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కోరుకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేను రద్దు చేసి రైతులను ఆదుకోవాలని బీజేపీ సీనియర్ నాయకుడు అడపా సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కోరుకొండలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కోటికేశవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అనేక మంది రైతులు రీ సర్వేకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారన్నారు. రైతుల సమస్యలపై స్పందించిన రైతు నాయకుడు సుధీర్‌కుమార్ రెవెన్యూ అధికారులకు గ్రామ సమస్యలను వివరించారు. గత ప్రభుత్వ పాలనలో అధికారులు ఒక గదిలో కూర్చుని రీ సర్వే చేశారని ఫలితంగా నేడు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో భూవివాదాలను పరిష్కరించాలన్నారు.

అస్సాగో యాజమాన్యానికి నిరసన సెగ


నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న బాధితులు

గోకవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డిలో నిర్వహిస్తున్న అస్సాగో ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యానికి శుక్రవారం నిరసన సెగ తగిలింది. గ్రామంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడానికి వచ్చిన కంపెనీ నిర్వాహకులను గ్రామస్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఒకపక్క ఆరోగ్యాన్ని నాశనం చేస్తూ, మరోపక్క తాయిలాలు పంచడం ఏమిటంటూ నిలదీశారు. ఇది తెలుసుకున్న పోలీసు లు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

గ్రామాల్లో చిచ్చుపెడతారా: ఎన్నో ఏళ్లుగా ప్రశాంతంగా జీవిస్తున్న తమ గ్రామాల మధ్య కార్పొరేట్ సంస్థలు చిచ్చు పెడుతున్నాయంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అస్సాగో ఇథనాల్ పరిశ్రమ చుట్టూ ఉన్న గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందులున్న వారిని గుర్తించి ఉద్యోగాలు ఎరగా చూపుతున్నారని పలువురు మండిపడుతున్నారు. ఉద్యోగులుగా చేరిన వారిని అడ్డు పెట్టుకొని గ్రామస్తులను విభజించే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపిస్తున్నారు.

కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత గిరిజన ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి బాబ్జి, విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ చిలుకోటి కూర్మయ్య అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ముస్లిం నాయకుడు అమీర్ పాషా మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే దేశానికి శరణ్యమన్నారు. కార్యక్రమంలో సీహెచ్ సుబ్బారావు, తుమ్మల తాతారావు, కె.భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం కోశాధికారిగా నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం కోశాధికారిగా రాజమహేంద్రవరం డివిజన్‌కు చెందిన ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎం.శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడలో శుక్రవారం జరిగిన జిల్లా సంఘం ఎన్నికల్లో ఈ మేరకు ఎన్నుకున్నట్లు రాష్ట్ర సంఘ ప్రచార కార్యదర్శి సీజేపీ పీటర్ ప్రభుదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం అధ్యక్షులు వేణుమాధవరావు వారికి అభినందనలు తెలిపారు.

విద్యార్థి దశ నుంచే విద్యుత్ పొదుపు అలవర్చుకోవాలి

అనపర్తి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే విద్యుత్ పొదుపుపై అవగాహన అలవర్చుకోవాలని అనపర్తి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిరంజన్‌బాబు అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతి కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో విజేతలుగా నిలిచిన ఎన్. వీరేంద్ర, డి.లక్ష్మీ కృష్ణ, జి.సాయి దుర్గా చరణ్‌లకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో జెఈ లోవరాజు, షిఫ్ట్ ఆపరేటర్ జ్యోతికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి

కోరుకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల వివరాలను ముందుగాగ్రామాల్లో ప్రచారం చేయాలని ప్రజలందరూ పాల్గొనే విధంగా భాగస్వామ్యం చేయాలని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ పేర్కొన్నారు. శ్రీరంగపట్నంలో నిర్వహించి రెవెన్యూ సదస్సుకు ఆయన విచ్చేసి గ్రామానికి సంబంధించి రెవెన్యూ సమస్యలను తహసీల్దార్ బి.సుస్వాగతం, సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సదస్సుల్లో స్వీకరించిన అర్జీలన్నీ బీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 534 అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు. జరిగిందన్నారు. అర్జీల పరిష్కారంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల పెద అమ్మాజీ, మద్దాల రమణ, తనకాల నాగేశ్వరరావు, బుద్దాబాపూజీ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

మాజీ ఎంపీ భరతరామ్‌పై టీడీపీ నాయకుల ధ్వజం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో రాజకీయంగా ఉనికి కోసమే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై బురద జల్లుతున్నావని మాజీ ఎంపీ భరత్ రామ్‌పై టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు ధ్వజమెత్తారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలను గౌరవించి పదవులు ఇచ్చింది టీడీపీయే అన్నారు. వైసీపీ పాలనలో 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి కనీసం కుర్చీలకు నిధులు కూడా లేకుండా చేశారని మండిపడ్డారు. సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్, యిన్నమూరి దీపు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఉల్లిపాయల మార్కెట్‌లో పేకాట ఆడుతున్న 9 మందిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం...రంభ, ఊర్వసి సెంటర్ సమీపంలోని ఉల్లిపాయల మార్కెట్‌లో పేకాట ఆడుతున్న వారిపై శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ27,800 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంబేడ్కర్‌పై మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు..

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీదేవి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాటలను వక్రీకరించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్‌కు భారతరత్న ఎవరు ఇచ్చారో తెలుసుకోవాలని సూచించారు. ఆయనకు సంబంధించిన ఐదు ప్రదేశాలను పంచ తీర్థ పేరుతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిందని తెలిపారు.

ఆదిశేఖర్‌ను కలిసిన జనసేన నాయకులు

పెరవలి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన నిడదవోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఉసులుమర్రుకు చెందిన జనసేన నాయకుడు పుల్లా ఆదిశేఖర్‌ను పలువురు జనసేన నాయకులు ఉసులుమర్రులోని ఆయన నివాసంలో కలుసుకుని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తులా చినబాబు, పాలా వీరాస్వామి, వాక శ్రీను, ఏడిద శ్రీను, రమేష్ పాల్గొన్నారు

టీఎల్ఎం ఆధారంగా వినూత్న బోధన


టీఎల్ఎం మేళాను సందర్శించిన రంగయ్య తదితరులు

దివాన్‌చెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బోధన అభ్యసన సామగ్రి (టీఎల్ఎం) ఆధారంగా వినూత్న బోధన చేయవచ్చునని ఎస్ఈఆర్‌టీ సైకాలజిస్ట్ కోఆర్డినేటర్, ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రం పరిశీలకులు ఆర్.రంగయ్య అన్నారు. రాజానగరం మండలం కొండగుంటూరులో జరుగుతున్న ఐదోదశ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ నిర్వహించిన టీఎల్ఎం, ఎస్ఆర్ఎం మేళాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ పి.రాంబాబు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థుల అడ్మిషన్ల సమయంలో స్కూల్ రెడీ నెస్ (ఎస్ఆర్ఎం) మేళాను ఉపాధ్యాయులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ డి.సుజాతారత్నం, కేఆర్‌పీలు ఎం.గంగాధరరావు, ఎం.రాంబాబు, ఎంఈవోలు కె.తిరుమలరావు, చోడిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల శిక్షణ తరగతుల్లో ఎంపీడీవో ఝూన్సీ


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో ఝూన్సీ

రాజానగరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని, అందుకు అనుగుణంగా పంచాయతీ నిధులు వినియోగించుకోవాలని ఎంపీడీవో జేపీ ఝూన్సీ పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలపై మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు రాజానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఏడాది పంచాయతీ పరిధిలో నిర్వహించే గ్రామసభలు ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందన్నారు. జనవరి 31లోగా పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఎం.సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ వాణి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో విద్యుత్ స్తంభాలు తొలగించండి

రాజానగరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రద్వారబంధంలో తమకు సంబంధించిన శ్మశాన వాటికలో విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసిన కరెంట్ స్తంభాలను తక్షణమే తొలగించాలని చక్రద్వారబంధంలోని ఆర్యవైశ్యు లు పంచాయతీ కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గ్రామంలోని ఊరచెరువు గట్టును ఆనుకుని ఉన్న శ్మశాన వాటికలో విద్యుత్‌శాఖ అధికారులు స్తంభాలు నెలకొల్పి ఆక్రమించారన్నారు. పనులు నిలిపివేసి వాటిని తొలగించకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని ఆర్యవైశ్య కమిటీ సభ్యులు గాది వీర వెంకట సత్యనారాయణ, బలభద్ర బ్రహ్మాజీ రావు, దవులూరి శ్రీనివాసరావు, జి.సత్యనారా యణ హెచ్చరించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శికి సత్యవాణికి వినతిపత్రం అందించామన్నారు.


చక్రద్వారబంధంలోని ఆర్యవైశ్యుల శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

ఎలోహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

కడియం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎలోహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కడియం లెప్రసీ కాలనీలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పాస్టర్‌లు రమేష్, సుమియన్ దేవుని వాక్యాన్ని అందించారు. వంశీవెల్నెస్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ వంశీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని గ్రీటింగ్స్ అందించారు. పేదలకు దుస్తులు అందించారు. ఈ కార్యక్రమం కాశి శ్రీకాంత్ నిర్వహణలో జరగ్గా, ఆనంద్‌పాల్, డేవిడ్‌రాజు, మణి, పెట్టకుమార్, అనూష, కుమారి, భరత్, విద్యాసాగర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రుడాలో ఓపెన్ ఫోరం

రాజమహేంద్రవరం సిటీ. డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని రుడా కార్యాలయంలో శుక్రవారం వీసీ,కమిషనర్ కేతన్ గార్గ్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాగింది. పలువురు తమ భవనాలు,లేఅవుట్లకు సంబంధించిన అర్జీలను అధికారుల అందజేసి..తమ అనుమానాలు నివృత్తి చేసుకున్నారు.



జీడిపప్పు కేజీ రూ.780

- తగ్గిన జీడిగింజల దిగుబడులు
- పెరిగిన ధర..వినియోగంపై ప్రభావం
- అక్టోబరులో కేజీ రూ.800

దేవరపల్లి/నల్లజర్ల,డిసెంబరు 20 (ఆంధ్ర జ్యోతి) : జీడిపప్పు ధరలు దిగిరావడంలేదు.. జిల్లాలో సాగు విస్తీర్ణం ఉన్నా ధరలు మాత్రం ఆకాశం వైపే చూస్తున్నాయి. ఎగుమతులు పెరిగిపోవడం..ఉత్పత్తి తగ్గిపోవడంతో ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అయితే గతం కంటే కాస్త తగ్గుముఖం పట్టడంతో వినియోగదా రులు ఊపిరిపీల్చుకుంటున్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా జీడిగింజల దిగుబడి తగ్గడంతో ధరలు పెరిగినట్టు సమాచారం. జీడిగింజలు ఇతర దేశాలైన ఇండోనేషియా, టాంజానియా, ఆఫ్రికా, వియత్నాం వంటి దేశాల నుంచి మనదేశానికి దిగుమతి చేసుకుంటారు. మనదేశంలో జీడిగింజలు దిగుబడులు బాగుంటే ధరలు తక్కువగా ఉండేవి. అయితే దిగుబడులు తగ్గడంతో.. జీడితోటలపై ఆశక్తి సన్నగిల్లడంతో దిగుబడులు తగ్గాయి. ప్రస్తుతం జీడిపప్పు వినియోగం భారీగా పెరిగింది. ఏ వేడుకైనా ఏదో ఒక కూరలో జీడిపప్పు తేలాల్సిందే.అంతే కాకుండా ఇళ్లల్లోనూ వినియోగం పెరిగింది. గతంలో ఇళ్లల్లో జీడిపప్పు వినియోగం అంతగా ఉండేది కాదు. ప్రస్తుతం వినియోగం పెరగడంతో ధరలూ అదే స్థాయిలో ఉంటున్నాయి. 2023 మార్చిలో జీడిపప్పు ధర కేజీ రూ.500 ఉండేది. 2024 అక్టోబర్‌లో రూ.800కి ఎగబాకింది. డిసెంబర్‌లో రూ.780లకు దిగొచ్చింది. ప్రస్తుతం గుళ్ల ధర రూ.780, బద్ద రూ.780, ముక్క రూ.600, బాదం రూ.500, నూక రూ.300 ధరలు ఉన్నాయి. గతంలో ధరల కంటే ఒక్కసారిగా రూ.200 వరకు ధరలు పెరిగాయి. మనదేశంలో ఈ ధరలు పెరగడానికి ప్రతికూల వాతావరణం ప్రధానకారణం. దేవరపల్లి,నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో 200 వరకు జీడిపప్పు ఫ్యాక్టరీలు ఉన్నాయి.10 వేల మంది జీవనోపాధి పొందుతున్నారు.80 కేజీల జీడిగింజల రేటు రూ.12 వేలు నుంచి రూ.13 వేలు ఉంది. నాణ్యత బట్టి ధర ఉంటుంది.జీడిగింజల నాణ్యత తగ్గితే బస్తా రూ.10 వేలు ఉంటుంది. ప్రస్తుతం లాభదాయకంగానే ఉన్నా ఈ ఏడా ది అనుకున్నంత స్థాయిలో దిగుబడి రాలేదు.ఈ నేపథ్యంలో ప్రస్తుతం జీడిపప్పుకు డిమాండ్ ఏర్పడింది. జీడిపప్పు 80 కేజీల బస్తా రూ.62,400 ఉంది.

దిగుబడి తగ్గి..రేటు పెరిగింది..

విదేశాలు,మనదేశంలోనూ దిగుబడి తగ్గడమే జీడిపప్పు రేటు పెరగడా నికి కారణం.రేటు ఎక్కువగా ఉండడం, పప్పు బయట మార్కెట్‌లోకి వెళ్లకపోవడంతో వారానికి మూడు రోజులే ఫ్యాక్టరీ నడుపుడుతున్నాం.

- తీగల శ్రీనివాసగుప్తా, ఫ్యాక్టరీ యజమాని

రుడాను.. వదల్లేదు!

రుడా నిధులూ మింగేసిన వైసీపీ

- రూ.22 కోట్లకు లెక్కల్లేదు..
- ట్రెజరీ అకౌంట్ నుంచి మాయం
- జగన్ సభ ఖర్చు రుడాదే
- కొవ్వూరు సభకు రూ.50 లక్షలు
- కలెక్టర్ బంగ్లాకు రూ.3.5 కోట్లు
- మూడేళ్లలో జరగని ఆడిట్
- కూటమిలో రుడా ఆడిట్
- బయటకొస్తున్న వాస్తవాలు

వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఏం జరిగింది.. ఏం చేశారు.. ఏదో చేస్తున్నట్టు హడావుడి చేశారే తప్ప చేసిందేం లేదు.. నిధులను మాత్రం దర్జాగా పక్కదారి పట్టించేశారు.. రుడా సంఘటనే దానికి ఉదాహరణ.. రుడాకు సంబంధించిన నిధులు రూ.22 కోట్లు ఏమయ్యాయో నేటికీ తెలియదు.. ఎందుకంటే మూడేళ్లుగా ఆడిట్ జరగలేదు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆడిట్ నిర్వహిస్తే అసలు బాగోతం బయటపడింది.. ఇంతేనా ఇంకేమైనా ఉందా అనేది ప్రస్తుతం కూపీ లాగుతున్నారు..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలకు కొదువే లేదు..నిధులు పక్కదారి పట్టించడంలో గత వైసీపీ ప్రభుత్వం ఓ రికార్డు సాధించింది. పల్లె నుంచి పట్టణం వరకూ ఎక్కడ నిధులున్నా ఖజానాకు వెళ్లిపోవాల్సిందే. లెక్కా పత్రం ఉండేది కాదు.. నిబంధనలు తుంగలో తొక్కి నిధులు బొక్కేసిన తీరు చూసి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో విస్తుపోతున్నారు.అభివృద్ధిని పట్టించుకోకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండా,పన్నులు, ఇతర ఫీజుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రభు త్వం వాడేసుకోవడం గమనార్హం. దీనికి ఉదాహరణే రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)..రుడా నిధులు పక్కదారి పట్టించి టోపీ పెట్టిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

జగన్ పర్యటన ఖర్చు రుడాదే..

వైసీపీ లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. గత మూడేళ్లలో రుడా లావాదేవీలపై ఆడిట్ జరగలేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆడిట్ చేశారు. దీంతో ఇక్కడ లోపాలన్నీ వెలుగు చూస్తున్నాయి. రుడా పరిధిలోని లేఅవుట్లు, ఇతర భవనాలకు సంబంధించి వసూలు చేసే ఫీజును జమ చేయడానికి రెండు అకౌంట్లు ఉంటాయి. ఒకటి మెయిన్ అకౌంట్, రెండోది ట్రెజరీ పరిధిలో ఉండే పీడీ అకౌంట్. ఈ అకౌంట్‌తో అభివృద్ధి పనులు చేయాలి. కానీ ఇందులో రూ.22 కోట్లను రుడా అనుమతి కూడా తీసుకోకుండా నేరుగా వాడేశారు. తర్వాత దాని ఊసే లేదు. ఆ డబ్బంతా ఉంటే రుడా పరిధిలో అనేక అభివృద్ధి పనులు జరిగేవి. ఈ విషయాన్ని ఇటీవల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ దృష్టికి తీసుకుని వెళ్లినట్టు సమాచారం. దీనిపై కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి మరి. ఇక కలెక్టర్ బంగ్లాకు రుడా సొమ్ము రూ.3.5 కోట్లు ఖర్చు చేసినట్టు చెబుతూ వచ్చారు. గతంలో జగన్ కొవ్వూరు డివిజన్‌లో పర్యటనకు వచ్చిన సందర్భంగా అక్కడ ఏర్పాట్లకు రూ.50 లక్షలు రుడా నుంచి లాగేశారు. వాటిని రీఎంబర్స్ చేస్తామని అప్పట్లో చెప్పినా తర్వాత దాని ఊసే ఎత్తకపోవడం గమనార్హం. సాధారణంగా ప్రతి ఏడాది ఆ సంవత్సరంలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఆడిట్ జరగాలి. కానీ మూడేళ్లలో ఒక్కసారి కూడా ఆడిట్ జరగకపోవడం గమనార్హం. గతంలోనే ఆడిట్ చేసి ఉంటే ట్రెజరీ నుంచి రూ.22 కోట్లు ప్రభుత్వం వాడేసుకోవడం, జగన్ పర్యటకు రూ.50 లక్షలు వాడడం వంటి వ్యవహారాలన్నీ బయటకు వచ్చేవి. అసలు జగన్ పర్యటనకు ఈ నిధులు ఎలా ఇచ్చారనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఇది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అభివృద్ధి, ప్లానింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు వినియోగించాల్సిన నిధులను ఇలా దారి మళ్లించడం వల్ల రుడా సొమ్ము వృథా అయినట్టు ఉందనే విమర్శలు వస్తున్నాయి.

మూడేళ్లు.. ఏ ప్లానూ లేదు..

రుడా పరిధిలో కొన్ని ప్లాన్‌లు ఉంటాయి. పర్స్పెక్టివ్ ప్లాన్, మాస్టర్‌ప్లాన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్, రీజినల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఉంటుంది. కానీ గత రుడా పరిధిలో ఈ ప్లాన్‌లు అసలు జరగలేదు. మాస్టర్ ప్లాన్ కూడా లేదు. దీని వల్ల ఇటీవల అర్బన్ ఏరియా అభివృద్ధికి కేంద్రం నిధులు రావాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం ఉంది.ప్రస్తుత రుడా అధికారులు చేసేదేమీలేక 2019కి ముందు గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(గుడా)గా ఉన్న సమయంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను రాజమండ్రి సిటీ, దానిని పరిసర ప్రాంతాలకు చెందిన ప్లాన్ పంపించినట్టు సమాచారం. దీంతో రుడా పరిధిలోని విస్తీర్ణమంతా ఈ మాస్టర్ ప్లాన్‌లో లేదు. ప్రస్తుతం రాజమండ్రి, కొవ్వూరు డివిజన్లతో పాటు కొత్తపేట, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో కొంత ప్రాంతం కూడా రుడా పరిధిలో ఉంది. కానీ అధికారులు హడావిడిగా పంపిన ఈ ప్లాన్‌లో చాలా విస్తీర్ణం లేకపోవడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వం దృష్టిపెట్టి ఉంటే ఇవాళ మాస్టర్ ప్లాన్ కూడా లేని దుస్థితి వచ్చి ఉండేది కాదనే విమర్శలున్నాయి.

ప్రస్తుత పాలకవర్గం రూటెటు..

ప్రస్తుత పాలకవర్గం గత ప్రభుత్వం పక్కదారి పట్టించిన సొమ్మును ఎలా తిరిగి తెస్తుందో చూడాలి మరి.ఇంకా కొన్ని పనుల్లో బాధ్యతారాహి త్యంగా వ్యవహరించినట్టు విమర్శలు ఉన్నాయి. చాలా చోట్ల జిమ్‌లు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణపై సందిగ్ధత నెలకొనడంతో కొద్దిరోజుల తర్వాత ఈ జిమ్‌ల పరిస్థితి ఏంటనేది ప్ర శ్నార్థకంగా ఉంది. ప్రస్తుతం రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ గత ప్రభుత్వ అవకతవలపై ఎటు వంటి చర్యకు ఉపక్రమిస్తారో వేచిచూడాల్సిందే.

ఎస్‌బీ డీఎస్పీగా రామకృష్ణ



రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి):తూర్పుగోదావరి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బి.రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణ గతంలో తూర్పుగోదావరి జిల్లాలో పనిచేశారు.అటుపై కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్‌డీపీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై రాజమహేంద్రవరం వచ్చారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌బీ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.అనంతరం ఎస్పీ డి.నరసింహకిషోర్‌ను కలిసి మొక్క అందించారు.

26 నుంచి భాస్కర్‌నగర్ డాక్యుమెంట్లు పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భాస్కర్‌నగర్ ప్రాంతం నివాసులకు చెందిన దస్తావేజు, వాటి లింక్ దస్తావేజులను మీమీ ప్లాట్ల వద్దే ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు కలెక్టర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు పరిశీలించడం జరుగుతుందని జిల్లా సహకార అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజమహేంద్రవరం భాస్కర్ నగర్ ప్రాంతంలో ది రాజమండ్రి పబ్లిక్ సర్వెంట్స్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన ప్లాట్లకు సంబంధించి యజమానులు దస్తావేజులు,లింక్ డాక్యుమెంట్లు, ఇంటి పన్ను,వాటర్ ట్యాక్స్ రసీదు ,ఇంటి ప్లాను, కరెంట్ బిల్లులను పరిశీలిస్తామని చెప్పారు.1970 నుంచి ఇప్పటి వరకు గల ఒరిజినల్ దస్తావేజులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.సందేహాలకు లిక్విడేటర్ నెం 944 12 39077ను సంప్రదించాలని కోరారు.

పంటకు బీమా.. రైతుకు ధీమా 8

వైసీపీ నాయకులు వద్దు!

రసాభాసగా కొవ్వూరు టీడీపీ సమావేశం

- గత ఐదేళ్లు ఎంతో కష్టపడ్డాం
- టీడీపీ పేరు చెబితే వేధించారు
- మాపై కేసులు పెట్టారు..
- నేటికీ స్టేషన్లకు వెళుతున్నాం
- రాజీవ్‌కృష్ణను ఎలా చేర్చుకుంటారు
- నిలదీసిన టీడీపీ నాయకులు
- సర్దిచెప్పిన ద్విసభ్య కమిటీ
- అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తాం
- ఎమ్మెల్యే ముప్పిడి



వైసీపీ నాయకులను చేర్చుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించిన వైసీపీ నాయకులు మాకొద్దు అంటూ టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన తెలుగుదేశం పార్టీ సమావేశం రసాభాసగా మారింది. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని చెబుతుండగా కార్యకర్తలు, నాయకులు స్టేజి వద్దకు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని గత ఐదేళ్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలను వేధించిన రాజీవ్‌కృష్ణ, అతని అనుచరులను నియోజకవర్గ నాయకులకు తెలియకుండా టీడీపీలో చేర్చుకోవడాన్ని తప్పుబట్టారు. బి.గంగరాజు మాట్లాడుతూ రాజీవ్‌కృష్ణతో పాటు మరి కొంత మంది వైసీపీ నాయకులు టీడీపీ కండువాలు కప్పుకోవడంతో గ్రామాల్లో అందరూ ఎగతాళి చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెట్టిన కేసులకు ఈ రోజుకి స్టేషన్‌కు వెళ్లి సంతకాలు పెడుతున్నామన్నారు. తాళ్లపూడి మండల అధ్యక్షుడు నామాన పరమేష్ మాట్లాడుతూ మమ్మల్ని ఇబ్బందులు పెట్టిన వైసీపీ నాయకులను ఏ విధంగా పార్టీలో చేర్చుకుంటారని ప్రశ్నించారు. నాదెళ్ళ శ్రీరామ్ మాట్లాడుతూ ఐదేళ్లు కష్టపడ్డాం.. పార్టీ గెలిచిందన్న ఆనందం ఆరు నెలలు కూడా లేకుండా చేస్తున్నారన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు గౌరవం అందించాలని డిమాండ్ చేశారు.ఐటీడీపీ ఇన్‌చార్జి గెల్లా సురేష్ మాట్లాడుతూ వైసీపీ నాయకులతో కుమ్మక్కై మాజీ మంత్రి జవహర్ కొవ్వూరు నియోజకవర్గంలో ఫ్లెక్సీల రాజకీయం ఆరంభించారన్నారు. బీసీ నాయకుడు కాగిత రఘు మాట్లాడుతూ టీడీపీ నాయకులపై కేసులు పెట్టించి ఇబ్బందులు పెట్టిన నాయకులను ఏ విధంగా పార్టీలో చేర్చుకుంటారన్నారు. నియోజకవర్గంలో మళ్లీ గ్రూపు రాజకీయాలు మొదలయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లి కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలకు గౌర వం అందించాలన్నారు. రాజీవ్‌కృష్ణ, అతని అను చరులను పార్టీలో చేర్చడానికి మాజీ మంత్రి కె. జవహర్, అతని కుమారుడు ఆశిష్‌లాల్ సహకరించడంపై మండిపడ్డారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాపై కూడా 15 కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారు. నా కారుపై దాడిచేశారు. కార్యకర్తలు బాధ, ఆవేదన నూటికి నూరు శాతం నిజం. కార్యకర్తల ఆవేదనను నియోజకవర్గ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు సమక్షంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల దృష్టికి తీసుకువెళ్తానన్నారు.మిమ్మల్ని కాదని కొత్తగా వచ్చిన వారికి పెద్దపీట వేయడం జరగదన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, నామాన పరమేష్, వట్టికూటి వెంకటేశ్వరరావు, రాజాన శ్రీనివాస్, మరపట్ల కళాధర్, ఎస్సీ , రజక కార్పొరేషన్ డైరెక్టర్లు వేమగిరి వెంకట్రావు, సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పది ఫలితాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి చిత్రంలో జిల్లా విద్యాధికారులు

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం విద్యా, అనుబంధ శాఖల జిల్లా, డివిజన్ ,మండల స్థాయి అధికారులతో విద్యాశాఖ ప్రగతి లక్ష్యాలపై సమీక్షించారు. విద్యాప్రమాణాలు మెరుగు పరుచుకోవాలన్నారు.నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యాలు సాధించడంపై చక్కటి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని సూచించారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు సమయానికి ఐదు నిమిషాలు ముందుగానే ఉండాలన్నారు. స్టూడెంట్స్ ఆధార్ అప్‌డేషన్, పాఠశాలల పర్యవేక్షణ, టీచర్స్ , స్టూడెంట్స్ హాజరు, మధ్యాహ్న భోజన పథకం వంటి అంశాలపై ఆరా తీశారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా 100 రోజులు అదనపు తరగతులకు ప్రణాళిక వేశామన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు లక్ష్యాలను ఇచ్చి విద్యార్థులను మ్యాపింగ్ చేసినట్టు డీఈవో వాసుదేవరావు తెలిపారు. సమీక్షలో డీఎల్‌డీవో పి . వీణాదేవి,పీవో ఎస్.సుభాషిణి, ఆర్ ఐవో ఎన్ఎస్‌వీ ఎల్‌నరసింహరావు, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

101 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాం

కలెక్టర్ ప్రశాంతి

గోకవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా ఉన్న భూ, రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు.ల్యాండ్ సీలింగ్ కేసులకు చెందిన అర్జీల పరిష్కారంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో ఈ నెల 12 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఇంత వరకు జిల్లాలో 101 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్టు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిలో ఆమోదయోగ్యమైన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి సదస్సుకు హాజరైన రైతుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి, తహశీల్దార్ ఎం.వి.సాయిప్రసాద్ ఉన్నారు.



కొత్తపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ఎస్ఈ తిలక్‌కుమార్ తదితరులు

5 స్టార్ రేటెడ్ పరికరాలే వినియోగించండి : ఎస్ఈ

రాజమహేంద్రవరంసిటీ/కల్చరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవడం వల్ల భవిష్యత్తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ కే.తిలక్ కుమార్ అన్నారు.ఈ నెల 14 నుంచి ప్రారంభమైన జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు ముగింపును పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.అందరూ 5స్టార్ రేటెడ్ విద్యుత్ పరికరాలను వినియోగించాలని, అవసరం లేనప్పుడు ఇంట్లో ఫ్యాన్లు, లైట్లు ఆఫ్ చేయాలన్నారు. ఈ నెల 18న నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం టౌన్ ఆపరేషన్స్ డివిజన్ ఈఈ నక్కపల్లి శామ్యూల్, డీఈఈ చిన్నమాల్యాద్రి, ఏఈ డి.శ్రీనివాస్, జూనియర్ ఇంజనీర్లు,విద్యుత్ శాఖ ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ప్రైవేట్ వైద్య సేవలు

- సూపర్‌స్పెషాలిటీ సేవలకు గ్రీన్‌సిగ్నల్
- గత సమావేశంలో ఎమ్మెల్యే తీర్మానం
- ఐఎంఏతో సూపరింటెండెంట్ చర్చ
- రోజువారి ప్రైవేటు వైద్యుల సేవలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీజీహెచ్)లో ప్రైవేట్ వైద్యుల సేవలకు జిల్లా ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ప్రభుత్వ బోధనాసుపత్రిలో ప్రైవేట్ సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలకు రంగం సిద్ధమైంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వీటిని స్పాన్సర్ చేస్తోంది. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ ప్రైవేట్ ఆసుపత్రుల సూపర్ స్పెషాలిటీ వైద్యుల సేవలను ఉపయోగించుకోవాలని అందరు హెచ్‌వోడీలకు ఆదేశాలు ఇచ్చారు. ఏ రోజు ఏ స్పెషాలిటీ వైద్యులు సేవలందిస్తారనే టైం టేబుల్‌ను విడుదల చేశారు. జీజీహెచ్‌లో సోమవారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రైవేట్ వైద్యుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మంగళవారం ఐఎంఏ హాలులో ఐఎంఏ ప్రెసిడెంట్, ప్రైవేట్ వైద్యులతో జీజీహెచ్ సూపరింటెండెంట్ సమావేశమై చర్చించి తుది నిర్ణయం తీసుకున్నారు. దీనికి అనుగుణంగా శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు జారీ చేస్తూ ప్రైవేట్ స్పెషలిస్టు వైద్యుల టైం టేబుల్‌ను విడుదల చేశారు. ఐఎంఏ పర్యవేక్షణలో సూపర్‌స్పెషాలిటీ వైద్యులు జీజీహెచ్‌లో అవుట్‌పేషెంట్ (ఓపీ) సేవలు అందించనున్నారు.



ప్రైవేట్ వైద్యుల షెడ్యూల్ ఇలా..

జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవల ఓపీ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకూ ఉంటుంది. మంగళవారం రోజు మాత్రం యూరాలజిస్టులు 5 గంటల వరకూ ఉంటారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలకు జీజీహెచ్‌లోని ఓపీ కారిడార్‌లో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించనున్నారు. షెడ్యూల్ ప్రకారం... ప్రతి మంగళవారం వాస్క్యులర్ సర్జన్, నెఫ్రాలజిస్ట్, యూరాలజిస్ట్ (ఇద్దరు వైద్యులు) ఓపీలో అందుబాటులో ఉంటారు. వాస్క్యులర్ సర్జన్ 3 నుంచి 4 గంటల వరకూ మాత్రమే ఉంటే మిగిలిన వైద్యులు 5 గంటల వరకూ ఉంటారు.బుధవారం యూరాలజిస్ట్, గురువారం కార్డియాలజీ, శుక్రవారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ప్లాస్టిక్ సర్జన్ ఓపీలో ఉంటారు.దీంతో జీజీహెచ్‌లో మళ్లీ ప్రైవేట్ వైద్యసేవలు ప్రారంభం కానున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు,డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానని, సేవకుడిగా పనిచేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఓటర్లలో 35శాతం సభ్యత్వ నమోదు చేయాలన్నారు. ఇతర పార్టీలు రూ.500తో సభ్యత్వం నమోదు చేస్తున్నా, టీడీపీ కేవలం రూ.100లతో సభ్యత్వ నమోదు చేస్తోందని, ప్రమాద బీమా వస్తుందని తెలియజేయాలన్నారు. స్థానిక ఏబీఎన్ కళాశాలలో శనివారం జరిగే జాబ్‌మేళాలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఎక్కువగా పాల్గొనేలా చూడాలన్నారు. సమావేశంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, నామాన పరమేష్, వట్టికూటి వెంకటేశ్వరరావు, ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్ పాల్గొన్నారు.

ఆదిశేఖర్‌ను కలిసిన జనసేన నాయకులు



ఆదిశేఖర్‌ను అభినందిస్తున్న నాయకులు

పెరవలి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన నిడదవోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఉసులుమర్రుకు చెందిన జనసేన నాయకుడు పుల్లా ఆదిశేఖర్‌ను పలువురు జనసేన నాయకులు ఉసులుమర్రులోని ఆయన నివాసంలో కలుసుకుని అభినందనలు తెలిపారు. కానూరు నీటి సంఘం ఉపాధ్యక్షుడిగానే గాక డీసీ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తులా చినబాబు, పాలా వీరాస్వామి, వాక శ్రీను, ఏడిద శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం



వేడుకల్లో చిన్నారులకు బహుమతులు అందజేసిన దృశ్యం

నిడదవోలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని, ప్రేమశాంతి సందేశాన్ని సమాజానికి అందించారని తెలుగుదేశం పార్టీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నిడదవోలులోని సెయింట్ జాన్స్ బోర్డింగ్‌లో హెరాల్డ్స్ గుడ్ న్యూస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చిగోళ్ల అదృష్టరాజు మాట్లాడుతూ క్రిస్మస్ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని మనతోపాటు పేదలందరూ క్రిస్మస్‌ను ఘనంగా చేసుకోవాలనే ఉద్దేశ్యంతోనే పేదలైన చిన్నారులకు, వితంతువులకు సొసైటీ తరఫున బహుమతులు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎల్లే బుజ్జిబాబు, స్వర్ణముఖి, బైపే రాజేశ్వరరావు, ఏలేటి సుందరం తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల నిరసనకు ఖండన: బీజేపీ



అధికారులకు అందించే వినతిపత్రం విడుదల చేస్తున్న నాయకులు

నిడదవోలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను వక్రీకరించి వామపక్షాలు చేస్తున్న నిరసనలు సరికాదని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం నిడదవోలులో బీజేపీ ఆధ్వర్యంలో తహశీల్దార్, పట్టణ పోలీస్‌స్టేషన్లో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటులో అమిత్‌షా విశ్లేషణ పూర్తి కాకుండానే వామపక్షాలు నిర సన వైఖరికి తెరలేపాయని వాటిని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బండి సత్యనారాయణ, పట్టణాధ్యక్షుడు నీలం రామారావు, కుడిపూడి నరేష్, చామంతి భీమేశ్వరరావు, కె.చిట్టిబాబు, కోయి రవి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



పాలంగిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్

ఉండ్రాజవరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం మండలంలోని పాలంగి మెయిన్‌రోడ్డులో ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని, ప్రాణరక్షణకు ఎంతో అవసరమని చెప్పారు. మైనర్‌లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. హెల్మెట్లు, లైసెన్సులు లేనివారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఎం.రామకృష్ణ, వి.త్రినాథ్, ఎం.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత



పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లు ఉపాధ్యాయులకు అందజేస్తున్న ఎంఈవో అప్పారావు

దేవరపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు సంబంధించిన పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవడానికి మోడల్ టెస్ట్ పేపర్లు ఎంతో దోహదపడతాయని ఎంఈవో అప్పారావు అన్నారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద పదో తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఈ టెస్ట్ పేపర్‌లో ఉన్న ప్రశ్నలకు 60 నుంచి 80మార్కుల వరకు ఇంపార్టెంట్ క్వశ్చన్స్ వస్తాయని విద్యార్థులు టెస్ట్‌పేపర్లు బాగా చదివేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్‌వీవీ రామారావు, హేమసుందర్, శివరాజు, ఉమాకాంత్, నాగేంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం'

దేవరపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు ఎంతో దోహదం చేస్తాయని 3ఎఫ్ ఆయిల్‌పామ్ డైరెక్టర్ ఆశిష్ గొయాంకా అన్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో 3ఎఫ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ కార్మికులకు క్రీడాపోటీల్లో భాగంగా జడ్పీ హైస్కూల్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గొయాంకా టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3ఎఫ్ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తుందన్నారు. ఈ స్కూల్, కళాశాలకు, జూనియర్ కాలేజీకి తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ విజయ్‌ప్రసాద్, కరుటూరి రామకృష్ణ, హెచ్‌ఆర్ గాయిత్రీ, మేనేజర్లు శివరామకృష్ణ, గణేష్, కార్మికులుపాల్గొన్నారు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, పెయింటింగ్, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. శక్తి వనరుల పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు.కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి,అధ్యాపకులు పాల్గొన్నారు.

వీఆర్వో అందుబాటులో ఉండడం లేదు

- ఎమ్మెల్యేకు పశివేదల గ్రామస్థుల ఫిర్యాదు
- పనిచేయాలని లేకపోతే బదిలీపై వెళ్లిపోవాలని వీఆర్వోపై ముప్పిడి ఆగ్రహం
- పలుచోట్ల రెవెన్యూ సదస్సులు



పశివేదలలో వీఆర్వోపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

కొవ్వూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేతో గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వార్డు సభ్యుడు యలమాటి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో వీఆర్వో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, రీసర్వే కారణంగా ఇనామ్ భూముల పట్టాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వీఆర్వోను ఎమ్మెల్యే వివరణ అడిగారు. పనిచేయాలని లేకపోతే బదిలీపై వెళ్లిపోవాలని ఆగ్రహించారు. కొవ్వూరు మండలంలో బదిలీ అయిన వీఆర్వోల స్థానంలో కొత్త వారిని నియమించకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం కొత్తవారిని నియమించాలని ఆర్డీవో రాణి సుస్మితకు ఫోన్‌లో తెలియజేశారు. అలాగే ఇనామ్ భూములకు వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో పట్టాదారుల కాలంలో మసీదు అని నమోదు చేయడంతో 2024 జనవరి నుంచి పట్టాదారులకు 1బీ, అడంగల్ రాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుకు ఫోన్‌లో తెలియజేశారు. అలాగే రీసర్వే ద్వారా పడుతున్న ఇబ్బందులపై రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంపల్లి సింహాచలం, ఉపసర్పంచ్ ఆలపాటి సాయికృష్ణ, ఎంపీటీసీ కె.బాలకృష్ణ, గారపాటి శ్రీనివాసరావు, రామచంద్రరావు, తుంపల్లి ఆదినారాయణ, గోపాల్ పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని నెలటూరు పంచాయతీ కార్యాలయం జరిగిన సదస్సులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రైతుల భూసమస్యలను పరిష్కరించడమే సదస్సుల ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా సదస్సుకు 7 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, యడ్లపల్లి రకారావు, తాళ్లూరి ప్రసాద్, తాళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని సగ్గొండ గ్రామంలో సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 16 అర్జీలు స్వీకరించినట్టు తహశీల్దార్ అజయ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీను పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని చివటం, వడ్లూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ కనకదుర్గ మాట్లాడుతూ భూముల రీసర్వే సమస్యలకు రెవెన్యూ సదస్సులు ద్వారా తక్షణ పరిష్కారం లభిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ అడంగల్‌లో పేరు తప్పుపడిన రైతులకు వెంటనే సరి చేసి ఇచ్చినట్టు ఆమె చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఈద్పుగంటి సత్యనారాయణ, ఆర్.తేజశ్రీ, మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, ఎండోమెంట్ జేఏ ఎంటీవీ రమణ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని లక్ష్మీపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో.. దుద్దుకూరుకు చెందిన కంటిపూడి వెంకటసుబ్బారావు లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 35లో 444సెంట్ల భూమి ఉండగా 28సెంట్లు కాల్వలో పోయిందని రికార్డులో చూపించారని, అయితే తన పొలం మీదుగా అసలు తాడిపూడి కాల్వ వెళ్లలేదని తెలిపారు. కాల్వలోకి వెళ్లినట్లు చూపించిన 28సెంట్లను రీసర్వేలో ఆన్‌లైన్ చేయాలని కోరారు. లక్ష్మీపురానికి చెందిన నున్నా సత్య పోసి నాగసురేష్ మాట్లాడుతూ తన భూమి తాడిపూడి కాల్వకు 23సెంట్లు ఇచ్చానని, 49సెంట్లు భూమి ఇచ్చినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదైందని, తన భూమిని రీసర్వే చేసి ఆన్‌లైన్ చేయాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాగా సదస్సులో రీసర్వేకు 5, ఆర్వోఆర్‌కు 3 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సర్వేయర్ డిల్లేశ్వరరావు, వీఆర్వో అనీత, తెలుగుదేశం పార్టీ నాయకులు నన్నా చిన్ని, మెంటిమి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం: చివటంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు

పంటకు బీమా.. రైతుకు ధీమా

- ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పేరిట పంటలకు బీమా సౌకర్యం
- కరువుతో పాటు.. విపత్తుల్లోనూ ఉపయోగం
- ఈ నెలాఖరు వరకే గడువు



ఎకరానికి బీమా వివరాలు

పంట	రైతువాటా	ప్రీమియం(రూ.)	బీమా(రూ.)
వరి	0.40శాతం	215	43,000
మొక్కజొన్న	0.30శాతం	105	35,000
శనగలు	1.15శాతం	368	32,000

కొవ్వూరు,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పేరిట రైతులు సాగుచేసిన పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. మరో పది రోజుల్లో గడువు ముగియనుంది. రబీ సాగుకు సమాయత్తం అవుతున్న ప్రస్తుత తరుణంలో బీమా పథకం సద్వినియోగంపై వ్యవసా యాధికారులు మరింత చైతన్యం తీసుకురావాల్సి ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం జరిగినపుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి ఈ పథకాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో లబ్ధి పొందేందుకు సీఎస్‌సీ సెంటర్లు, మీసేవ పోర్టలలో ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు రైతులు సాగు చేసిన పంటలకు వాటాగా కొంత నగదును చెల్లించి బీమా నమోదు చేయించుకోవాలి.

బీమా పొందేదిలా..

ప్రకృతి వైరీత్యాల వల్ల చీడపీడలు, ఈదురు గాలుల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు ప్ర భుత్వం నిర్ణయించిన జిల్లా, మండల, గ్రామాల యూనిట్ ప్రాతిపదికన బీమా చేయించుకున్న రైతులకు నష్టపరిహారం పొందే అవకాశం ఉంటు ంది. బీమా కోసం ఎంపిక చేసిన పంటలకు బ్యాం కుల నుంచి రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంకులు కూడా రైతులకు బీమాను నమోదు చేస్తున్నాయి. రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు ఫసల్‌బీమా చేయించుకోవాలంటే దర ఖాస్తు పూర్తిచేసి సంబంధిత పత్రాల ద్వారా సీఈసీలలో బీమా చేయించుకోవాలి.

పథకంలో ప్రధాన అంశాలు

ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనలో రబీ సీజన్‌లో సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ధర చెల్లించి బీమా చేయించుకోవాలి. ఇదే బీమా పథకంలో శనగలు, మినుములు, ఎండు మిర్చి, జొన్న పంటలకు కూడా వర్తింపజేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే పంట సాగుచేసిన తర్వాత బీమా చేయించుకునేందుకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదై ఉండాలి. అవసరమైన పత్రాలు జతపరుస్తూ ప్రభుత్వం అనుమతించిన మీ సేవ, సీఈ సీ కేంద్రాల ద్వారా ఈ పథకంలో ఐచ్ఛికంగా చేరవచ్చు.

పంట కోతల తర్వాత..

పంతకోతల తర్వాత పొలంలో ఆరబెట్టిన పంటలకు వర్షాలు, తుపాను, అకాల వర్షాల వల్ల పంటనష్టం జరిగినపుడు అధికారులు వేసిన అంచన మేరకు రైతులకు నష్టపరిహారం అందిస్తారు.

గడువు పెంచితే ప్రయోజనం..



2016లో ఈ పథకం వచ్చినా సరైన అవగా హన లేని కారణంగా ఇంకా చాలామంది రైతు లు బీమా చేయించుకోలేదు. ప్రస్తుతం అధికా రులు అవగాహన కల్పిస్తున్నా బీమా చేయిం చుకునేందుకు నెలాఖరు వరకే ఉన్నందున కేవలం పది రోజుల మాత్రమే వ్యవధి ఉన్నం దున మరింత అవగాహన అవసరం. రబీ వ్యవసాయపనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమవు తున్నందున జనవరి నెల వరకూ గడువు పెంచితే రైతులకు మరింత ప్రయోజనంగా ఉంటుంది.

బీవీ.సత్యనారాయణ, వరి రైతు

మొబైల్ వినియోగం తగ్గించాలి

నన్నయ తెలుగుశాఖ సహాయ ఆచార్యుడు వాసు

దివాన్‌చెరువు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నేటి తరం ఎక్కువగా మొబైల్ ఫోన్‌లను వాడుతూ కాలం వృథా చేస్తున్నారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సహాయాచార్యుడు తలారి వాసు అన్నారు. మొబైల్ ఫోన్ వినియోగం తగ్గించి అవసరం మేరకే వాటిని ఉపయోగించాలని సూచించారు. దివాన్‌చెరువులోని వీజే ఫార్మశీ కళాశాలలో బి-ఫార్మశీ, డి-ఫార్మశీ మొదటి సంవత్సరం తరగతులను శుక్రవారం ప్రారంభించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన వాసు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో కళాశాల కార్యదర్శి ఎన్‌వీవీ జగన్మోహనరెడ్డి, ఛైర్‌పర్సన్ ఎస్.శకుంతల, వైస్‌ఛైర్‌పర్సన్ ఎస్.తులసీ అపూర్వ, డైరెక్టర్ నిరూప్ కోటిరెడ్డి, ప్రిన్సిపాల్ డి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి.. సంజీవని : మద్దిపాటి



నల్లజర్లలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల/గోపాలపురం/దేవరపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారిన పడిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని వంటిదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2కోట్లకు పైగా సీఎం సహాయనిధి అందజేసినట్టు ఆయన తెలి పారు. నల్లజర్లలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూచిపూడి ఉదయభాస్కరావు, పసుమర్తి రతీష్, ఈడే శ్రీను పాల్గొన్నారు. గోపాలపురం మండలం జగన్నాథపురంలో చెక్కుల పంపిణీ అనంతరం వృద్ధులకు పండ్లు, దుప్పట్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, కొడూరి రఘురామ్, పసుమర్తి పెద్దబ్బులు, కాట్రగడ్డ సురేష్, పసుమర్తి రాఘవ, పసుమర్తి గోపాలకృష్ణ, కొర్లపాటి రాము, వడ్లమూడి రమేష్, జ్యేష్ఠ శ్రీధర్ పాల్గొన్నారు. పసుమర్తి రాఘవ పుట్టిన రోజు సందర్భంగా కేకును కోసి స్వీట్లు పంపిణీ చేశారు. దేవరపల్లి మండలం సంగాయిగూడెంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని సంగాయిగూడెం, కొత్తగూడెం, చిన్నాయిగూడెం, యాదవోలు, దుద్దుకూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.2,15,886 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు ఆండ్రూ అనీల్, సర్పంచ్ కరుటూరి ఉషారాణి, కరుటూరి శ్రీనివాస్, కుసులూరి శ్రీనివాస్, డీ.బ్రహ్మారాజు, కరుటూరి శరత్, ఉప్పులూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

- కానూరు, నల్లజర్లలో పీహెచ్‌సీల వద్ద వైద్య ఉద్యోగుల నిరసన



కానూరు పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

పెరవలి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలని వైద్య సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కానూరు పీహెచ్‌సీ వద్ద శుక్రవారం మధ్యాహ్నం భోజనం విరామం సమయంలో వైద్యఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు కావాలి.. పీహెచ్‌సీలకు రావాలి అనే నినాదంతో పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ మద్దతు, వైద్య ఉద్యోగుల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలులోనూ హెల్త్ అసిస్టెంట్‌ల పాత్ర ప్రధానమైందన్నారు. పీహెచ్‌సీల్లో హెల్త్ అసిస్టెంట్‌లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నల్లజర్ల: నల్లజర్ల పీహెచ్‌సీలో భోజన విరామ సమయంలో డాక్టర్ తెల్లం గంగాధరావు, మహ్మద్ సీరాజుద్దీన్, వైద్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీవీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో వారు ప్రాణాలకు తెగించి ప్రజల కోసం పని చేశారన్నారు. వీరి ఉద్యోగంతో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వెంటనే హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు.



నల్లజర్ల పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న వైద్య ఉద్యోగులు

సెయింట్ క్లారెట్ హైస్కూల్ వార్షికోత్సవం



సెయింట్ క్లారెట్ హైస్కూల్ వార్షికోత్సవంలో భాగంగా చిన్నారుల ప్రదర్శన

నల్లజర్ల,డిసెంబరు20(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలని ఎంపీపీ బంకా జయలక్ష్మి,సెయింట్ క్లారెట్ జీఎం డాక్టర్ సబు జార్జీ అన్నారు. నల్లజర్ల సెయింట్ క్లారెట్ హైస్కూల్ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు.విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ జోసెప్ శాంతప్ప, సర్పంచ్ పల్లి జ్యోతి, తల్లిదండ్రులు,టీచర్లు పాల్గొన్నారు.

పంచాయతీల పురోభివృద్ధికి శ్రద్ధ చూపాలి

- ఎంపీపీ దుర్గారావు
- సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ముగిసిన శిక్షణా తరగతులు



దేవరపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు పురోభివృద్ధి సాధించాలంటే అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లిలో మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు జరుగుతున్న శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగు నీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, ఈవోపీఆర్డీ రాజారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, మద్దూరు, సీతంపేట, మద్దూరులంక గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈవో పీఆర్డీ కె.ఉమామహేశ్వరశర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మిని శిక్షణను అందించారు. గ్రామాల వారీగా 2025-26 సంవత్సరానికి సుస్థిర అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీవో కె.సుశీల అన్నారు. ఆరోగ్యవంతమైన హరిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి సుస్థిర అభివృద్ధి ప్రణాళికలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంటు కె.ప్రసన్నకుమార్, బీహెచ్‌ఎస్ ప్రకాశరావు, సత్యవతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు: శిక్షణా తరగతుల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు